teenmaardesk@gmail.com

RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...

తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 184 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | గురువారం | 1 జనవరి 2026 | పేజీలు : 08 | వెల ₹5


Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.


## రామ్ లల్లా ప్రాణ ప్రతిష్ఠకు రెండేళ్లు

దేశ ప్రజలకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు

సోషల్ మీడియా వేదికగా మోదీ భావోద్వేగపూరిత సందేశం





# తెలంగాణలో లిక్కర్ కిక్కు

మద్యం సేవనంలో దేశంలోనే అగ్రస్థానం

నంబర్ 1 స్థానంలో తెలంగాణ

తలసరి మద్యం వినియోగం ఖర్చులో సరికొత్త రికార్డులు

పట్టణాల కంటే గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువగా విక్రయాలు



ఆరోగ్యానికి హితవు పలికే పాలు తాగడంలో వెనుకబడిన తెలంగాణ, హానికరమైన మద్యం సేవించడంలో మాత్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. పసిపిల్లల నుంచి వృద్ధుల వరకు అత్యంత అవసరమైన పాల వినియోగం రాష్ట్రంలో ఆందోళనకరంగా పడిపోతుంటే, లిక్కర్ విక్రయాలు మాత్రం సరికొత్త రికార్డులను సృష్టిస్తున్నాయి.

# గులాబీ గూటికి జంపింగ్ నేతలు

తెలంగాణ రాజకీయాల్లో 'ఘర్ వాపసీ' షురూ

కాంగ్రెస్, బీజేపీల నుంచి తిరిగి బీఆర్ఎస్ వైపు నేతల చూపు

అనర్హత వేటు భయంతో కారు బాట పడుతున్న నేతలు





తెలంగాణ రాజకీయాలు రసవత్తరంగా నడుస్తున్నాయి. ఇన్ని రోజులేమో.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీలు ఒక్కొక్కరిగా కాంగ్రెస్, బీజేపీ కండువాలు కప్పుకుంటూ గులాబీ బాస్ కేసీఆర్కు షాకుల మీద షాకులు ఇచ్చిన విషయం తెలిసిందే.

2



## నిరుద్యోగులకు నూతన సంవత్సర కానుక


14 వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

డీజీపీ శివధర్ రెడ్డి కీలక ప్రకటన

2



## తెలుగు రాష్ట్రాల్లో గజగజ వణికించే చలి



ఏపీలో వర్ష సూచన

తెలంగాణలో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు

ఏపీ, తెలంగాణలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు

వాతావరణ శాఖ కోల్డ్ వేవ్ హెచ్చరిక

తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): తెలుగు రాష్ట్రాల్లో చలి తీవ్రత పెరిగింది.. చలిగాలులతో ప్రజలు గజగజ వణికిపోతున్నారు. బయటకు వచ్చేందుకు

మిగతా 2 లో

## బీఆర్ఎస్‌లో కవిత చిచ్చు

- హరీష్ రావుపై కబ్జా ఆరోపణలు
- హరీష్ రావును తెలంగాణ చంద్రబాబుతో పోలుస్తూ వ్యాఖ్యలు



హైదరాబాద్, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): కల్వకుంట్ల కవిత రోజుకో బాంబు పేల్చుతూ బీఆర్ఎస్ ను ఆగమాగం చేస్తోంది. బీఆర్ఎస్ లోని అంతర్గత విషయాలను బయటపెడుతూ కవిత రాజేస్తున్న మాటల మంటలు కేటీఆర్, హరీష్ రావు లకు

మిగతా 2 లో

## జాతివివక్ష మానవత్వానికే గొడ్డలిపెట్టు

డెహ్రాడూన్ ఘటనపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం

త్రిపుర విద్యార్థిని ఏంజెల్ చక్మా హత్యపై కేటీఆర్ దిగ్భ్రాంతి



హైదరాబాద్, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): జాతివివక్ష అనేది మానవత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఘోరమైన నేరమని, ఇది భారత రాజ్యాంగ విలువలకే విఘాతమని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. జాతివివక్ష ఏ రూపంలో ఉన్నా దానిని సహించకూడదని ఆయన స్పష్టం చేశారు. డెహ్రాడూన్‌లో త్రిపురకు చెందిన ఎంబీఏ విద్యార్థిని ఏంజెల్ చక్మా దారుణ హత్యను ప్రస్తావిస్తూ ఈ ఘటన పట్ల కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వివక్ష, అధికార

మిగతా 2 లో



## కేసీఆర్ మళ్లీ ఎర్రవల్లి బాట

అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతారా..?

గులాబీ శ్రేణుల్లో ఉత్కంఠ

.. వివరాలు 2లో

## యూట్యూబర్ అన్వేష్‌పై పంజాగుట్టలో కేసు నమోదు



2

- దేవీదేవతలపై అనుచిత వ్యాఖ్యలే కారణం
- రంగంలోకి కరాటే కళ్యాణి
- హిందూ ధర్మాన్ని కించపరిచారంటూ ఫిర్యాదు

## తెలంగాణ యువతకు నైపుణ్యాల జాతర

యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీ సరికొత్త మైలురాయి

ఏడాది తిరగకముందే వందశాతం లక్ష్య సాధన



హైదరాబాద్, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ మరో కీలక మైలురాయిని చేరుకుంది. ఇంటర్, డిగ్రీ చదివిన విద్యార్థులకు ఉద్యోగాలకు సరిపడే

మిగతా 2 లో



2

## ప్రభుత్వ ఉద్యోగులకు ఊరట

రూ. 713 కోట్ల పెండింగ్ బిల్లులు విడుదల

బట్టి విక్రమార్క ఆదేశాలతో నిధుల మంజూరు




## సీబీఎస్ఈ 10, 12వ తరగతి బోర్డు పరీక్షల రీషెడ్యూల్

సవరించిన తేదీలను ప్రకటించిన బోర్డు

.. వివరాలు 2లో

# తెలంగాణలో 'లిక్కర్' కిక్కు



తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): ఆరోగ్యానికి హితవు పలికే పాలు తాగడంలో వెనుకబడిన తెలంగాణ, హానికరమైన మద్యం సేవించడంలో మాత్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. పసిపిల్లల నుంచి వృద్ధుల వరకు అత్యంత అవసరమైన పాల వినియోగం రాష్ట్రంలో ఆందోళనకరంగా పడిపోతుంటే, లిక్కర్ విక్రయాలు మాత్రం సరికొత్త రికార్డులను సృష్టిస్తున్నాయి. మద్యం వినియోగంలో దేశంలోనే టాప్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ తాజా నివేదిక ప్రకారం, తెలంగాణలో సగటు తలసరి ఆల్కహాల్ వినియోగం ఏడాదికి 4.44 లీటర్లుగా నమోదైంది. మద్యం కోసం ప్రజలు ఖర్చు చేస్తున్న సొమ్ములో కూడా మన రాష్ట్రమే దేశంలో మొదటి స్థానంలో ఉంది.

### సగటు ఖర్చు:

రాష్ట్రంలో ఒక్కొక్కరు ఏడాదికి సగటున రూ.11,351 విలువైన మద్యం తాగుతున్నారు. (ఆంధ్రప్రదేశ్‌లో ఇది కేవలం రూ.6,399 మాత్రమే).

గ్రామీణ ప్రాంతాల్లో అధికం: ఆశ్చర్యకరంగా పట్టణ ప్రాంతాల కంటే పల్లెల్లోనే తాగుడు తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు సర్వే వెల్లడించింది.

ప్రభుత్వ ఆదాయం: మద్యం విక్రయాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఏటా రూ. 36,000 కోట్ల పైచిలుకు ఆదాయం సమకూరుతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇది సుమారు రూ. 40,000 కోట్లకు చేరువయ్యే అవకాశం ఉందని అంచనా.



### పాలకు దూరం.. ఆరోగ్యానికి చేటు

మరోవైపు, పాలు మరియు పాల ఉత్పత్తుల వినియోగంలో తెలంగాణ దారుణమైన స్థితిలో ఉంది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ సిఫారసుల ప్రకారం ప్రతి వ్యక్తి రోజుకు 280 మి.లీ. పాలు తీసుకోవాలి. కానీ వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి.

### ప్రస్తుత వినియోగం:

పట్టణాల్లో 190 మి.లీ., గ్రామాల్లో 164 మి.లీ. మాత్రమే పాలను వాడుతున్నారు.

### పేదల దుస్థితి:

ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం, రాష్ట్రంలోని అత్యంత పేద వర్గాల్లో పాల వినియోగం ఏడాదికి కేవలం 1.7 లీటర్లకు మించడం లేదు. అంటే వీరు నెలకు కనీసం పావు లీటరు పాలు కూడా తాగడం లేదు.

### ఖర్చు వ్యత్యాసం:

గ్రామీణ ప్రాంతాల్లో ఒక వ్యక్తి పాలకు ఏడాదికి సగటున రూ. 4,200 ఖర్చు చేస్తుంటే, మద్యం కోసం చేసే ఖర్చు దీనికి మూడు రెట్లు ఎక్కువగా ఉండటం సామాజిక విశ్లేషకులను విస్మయానికి గురిచేస్తోంది.

### పాడి పరిశ్రమపై ప్రభావం

గతంలో (కేసీఆర్ హయాంలో) గ్రామీణ సగటు పాల వినియోగం రోజుకు 350 మి.లీ. వరకు ఉండగా, ప్రస్తుతం అది క్రమంగా తగ్గుతూ వస్తోంది. పాడి పరిశ్రమకు తగిన ప్రోత్సాహం లేకపోవడం, ధరల పెరుగుదల మరియు మారుతున్న జీవనశైలి కారణంగా సామాన్యులు పాలకు దూరమై మత్తుకు బానిసలవుతున్నారని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

ఒకవైపు మద్యం అమ్మకాల్లో దేశంలోనే టాప్-3లో ఉంటూ, వినియోగంలో నంబర్ 1 స్థానానికి చేరడం రాష్ట్ర ప్రగతికి సంకేతమా లేక సామాజిక పతనమా అన్నది ఆలోచించాల్సిన విషయం.

# జాతివివక్ష మానవత్వానికే గొడ్డలిపెట్టు

మొదటి పేజీ తరువాయి

దుర్వినియోగం కలిస్తే ఎంతటి ఘోరమైన పరిణామాలు ఎదురవుతాయో ఈ సంఘటన గుర్తు చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి నేరాలు కేవలం విడిగా జరిగిన సంఘటనలు కావని, ద్వేషాన్ని, వివక్షను సహించడం వల్ల కలిగే ముప్పుకు ఇవి ఒక హెచ్చరిక అని పేర్కొన్నారు.

**భారతదేశం ఇలాంటి విషాదం భరించలేదు**

భారతదేశం ఇటువంటి విషాన్ని భరించలేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. "భిన్నత్వంలో ఏకత్వం అనే పునాదిపై నిర్మించబడిన మన దేశం, ఇలాంటి విద్వేషాలను భరిస్తూ మనుగడ సాగించలేదు. న్యాయం అందించడంలో ఎటువంటి రాజీ ఉండకూడదు. జాతివివక్ష అది ప్రత్యక్షంగా ఉన్నా లేదా పరోక్షంగా ఉన్నా.. దానిపై 'జెరో టాలరెన్స్'( కఠిన వైఖరి) పాటించాలని కేటీఆర్ అన్నారు.

**జాతి వివక్షతో కూడిన మాటలు**

ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వంపై నైతిక మరియు



రాజ్యాంగపరమైన బాధ్యత ఉందని కేటీఆర్ గుర్తు చేశారు. జాతి వివక్షతో కూడిన మాటలు, ప్రవర్తన మరియు రెచ్చగొట్టే చర్యలను నేరంగా పరిగణిస్తూ కఠినమైన, స్పష్టమైన చట్టాలను తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. తక్షణ అరెస్టులు, విచారణ మరియు శిక్షలు పడేలా చట్టంలో నిబంధనలు ఉండాలని కోరారు. "చట్టం తన పని తాను చేయాలి, బాధ్యత అనేది పక్షపాతంగా ఉండకూడదు అని ఆయన నొక్కి చెప్పారు. భారత రాజ్యాంగం పౌరులందరికీ సమానత్వం మరియు గౌరవాన్ని వాగ్దానం చేసిందని, జాతి వివక్ష నుండి పౌరులను రక్షించడం అనేది కేవలం శాంతిభద్రతల సమస్య మాత్రమే కాదని, అది దేశం యొక్క మానవ హక్కుల నిబద్ధతకు నిదర్శనమని కేటీఆర్ అన్నారు. వివక్షను పెంచి పోషిస్తే అది వ్యవస్థలను భ్రష్టు పట్టించి, ప్రాణాలను ప్రమాదంలో పడేస్తుంది అని ఆయన హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం కేవలం మాటలతో సరిపెట్టకుండా ఇలాంటి నేరాలు మళ్లీ పునరావృతం కాకుండా కఠినమైన చట్టపరమైన రక్షణలు, పకడ్బందీ అమలు చేయాలని కేటీఆర్ కోరారు.

# తెలుగు రాష్ట్రాల్లో గజగజ వణికించే చలి

మొదటి పేజీ తరువాయి

జంకుతున్నారు. అయితే.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి. చాలా ప్రాంతాల్లో కోల్డ్ వేవ్స్ వణికిస్తున్నాయి. ఈ తరుణంలో వాతావరణ శాఖ అలర్ట్ జారీ చేసింది.. కొన్ని ప్రాంతాల్లో చలి తీవ్రత పెరుగుతుందని.. మరికొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. మూడు రోజుల వెదర్ రిపోర్ట్ ఎలా ఉందో ఈ కథనంలో తెలుసుకుందాం.

ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో వర్షాలు.. అమరావతి వాతావరణ కేంద్రం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణములో ఉత్తర %-% ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయి. వీటి ఫలితంగా రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకు వాతావరణ సూచనలు ఈ కింది విధంగా ఉన్నాయి.

**ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ యానాం :**

బుధవారం, గురువారం, శుక్రవారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉంది.

దక్షిణ కోస్తా ఆంధ్ర ప్రదేశ్:- బుధవారం, గురువారం తేలికపాటినుండి మోస్తరు వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. శుక్రవారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉంది.

రాయలసీమ:- బుధవారం, గురువారం తేలికపాటినుండి మోస్తరు వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. శుక్రవారం పొడి



వాతావరణం ఏర్పడే అవకాశము ఉంది.

గమనిక :- రాగల 3 రోజుల్లో కోస్తా ఆంధ్రప్రదేశ్, యానము, రాయలసీమలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదులో గణనీయమైన మార్పు ఉండదు. ఆ తర్వాత 2 రోజుల్లో ఒకటి లేదా రెండు చోట్ల సాధారణము కంటే 2-3 డిగ్రీల సెంటీగ్రేడ్ తక్కువగా నమోదయ్యే అవకాశముంది. తెలంగాణ రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకు వాతావరణ విశ్లేషణ, వాతావరణ హెచ్చరికలు : హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకారం.. తెలంగాణ రాష్ట్రంలో క్రింది స్థాయి గాలులు ప్రధానముగా తూర్పు, ఆగ్నేయ దిశల నుండి వీస్తున్నవి.. రాగల 3 రోజులు ఉష్ణోగ్రతలు మరింత తగ్గే అవకాశం ఉంది.. బుధవారం, గురువారం, శుక్రవారం రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది. రాబోయే రెండు రోజుల్లో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3°C నుండి 5°C తక్కువగా నమోదయ్యే అవకాశం ఉంది. ఈరోజు కొన్ని ఉత్తర, పశ్చిమ తెలంగాణ జిల్లాలలో అక్కడక్కడ చలిగాలులు వీచే అవకాశం ఉంది.



# నిరుద్యోగులకు నూతన సంవత్సర కానుక

హైదరాబాద్, డిసెంబరు 31 (తీన్మార్ న్యూస్) : తెలంగాణలోని నిరుద్యోగులకు పోలీసు శాఖ శుభవార్త తెలిపింది. త్వరలో 14 వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్ జారీ చేయనున్నామని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. దాదాపు రెండేళ్ల నుంచి లక్షలాది మంది నిరుద్యోగులు ఈ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారు. సుమారు 14 వేల స్టయిపెండరీ క్యాడెట్ కానిస్టేబుళ్లతో పాటు ఇతర యూనిఫామ్ సర్వీసుల కానిస్టేబుళ్ల భర్తీకి సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వం ముందు ఉన్నాయని ఆయన తెలిపారు. నూతన సంవత్సరం దీనికి సంబంధించిన ప్రకటన జారీ కావచ్చని మంగళవారం డీజీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో శివధర్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు మూడుసార్లు మాత్రమే పోలీసు రిక్రూట్‌మెంట్లు జరిగాయి. 2016లో 9,281, 2018లో 16,925, 2022లో 17,000 పోస్టులకు సంబంధించిన నోటిఫికేషన్లు విడుదల అయ్యాయి. 2023 నుంచి ఈ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో జాప్యం అవుతోన్న నేపథ్యంలో నిరుద్యోగుల నుంచి ప్రభుత్వంపై తీవ్రమైన ఒత్తిడి వచ్చింది. ఈ క్రమంలో ఆ నోటిఫికేషన్ విడుదల అవుతుంద న్న సమాచారాన్ని డీజీపీ నిర్ధారించారు. పోలీసు శాఖలో ఏటా జరుగుతున్న పదవీ విరమణల వల్ల సిబ్బంది సంఖ్య తగ్గుముఖం పడుతోంది. మరోవైపు నిర్ణీత వ్యవధిలో కానిస్టేబుళ్ల భర్తీ జరగకపోవడంతో వేలాది పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి. మిగిలిన సిబ్బందిపై పనిభారం ఎక్కువ అవుతోంది. ఈపోస్టులను రెండేళ్లకు ఒకసారి క్రమం తప్పకుండా భర్తీ చేస్తేనే సిబ్బంది సంఖ్య బ్యాలెన్స్ అవుతుందని, ఆలస్యం అయ్యేకొద్దీ మిగిలిన పోలీసులపై పని ఒత్తిడి ఎక్కువ అవుతుందని పోలీసు సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు.

# యూట్యూబర్ అన్వేష్‌పై పంజాగుట్టలో కేసు నమోదు

తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): యూట్యూబర్ అన్వేష్‌పై (YouTuber Anvesh) కేసు నమోదు అయ్యింది. దేవీ దేవతలను దూషించారంటూ అన్వేష్‌పై సినీనటి, బీజేపీ నాయకురాలు కరాటే కళ్యాణి పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కళ్యాణి ఫిర్యాదు మేరకు అన్వేష్‌పై బీఎన్ఎస్ సెక్షన్ 352,79,299, ఐటీ చట్టంలోని 67 సెక్షన్ కింది పోలీసులు కేసు నమోదు చేశారు. త్వరలో అన్వేష్‌కు పంజాగుట్ట పోలీసులు నోటీసులు జారీ చేయనున్నారు. అన్వేష్ వివాదాస్పద కామెంట్స్‌పై తెలంగాణలో వరస ఫిర్యాదులు చేస్తున్నారు. ఇక అన్వేష్‌ను దేశ ద్రోహిగా ప్రకటించాలని, అతడిని భారత్‌కు రప్పించాలని హిందూ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# బీఆర్ఎస్‌లో 'కవిత' చిచ్చు

మొదటి పేజీ తరువాయి



ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి. న్యూ ఇయర్ వచ్చేవేళ ఈ ఇయర్ ఎండింగ్లో కవిత మరోసారి మీడియా ముందుకు వచ్చి ఈసారి హరీష్ రావును బీఆర్ఎస్ రాజకీయాలను ఎండగట్టారు. తాజాగా కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా హరీష్ రావును ఉద్దేశించి తెలంగాణ చంద్రబాబు గా అభివర్ణిస్తూ ఆమె చేసిన విమర్శలు పార్టీ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసాయి. బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెన్షన్ కు గురైన కల్వకుంట్ల కవిత 2025 ఏడాది ముగింపు వేళ సొంత పార్టీ నేతలపై నిప్పులు చెరిగారు. ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు గులాబీ శ్రేణుల్లో పెను ప్రకంపనాలు సృష్టిస్తున్నాయి. హరీష్ రావు ఎప్పటికైనా తెలంగాణలో చంద్రబాబు తరహా రాజకీయాలు చేస్తారని పార్టీని కబ్జా చేసే అవకాశం ఉందనే అనుమానం కార్యకర్తల్లో ఉందని కవిత బాంబు పేల్చారు. హరీష్ రావు పార్టీకి ద్రోహం చేస్తారని కేడర్ భావిస్తుందని ఆమె ఆరోపించారు. 2019 లోక్సభ ఎన్నికల్లో తన ఓటమి వెనుక ఎవరున్నారో తనకు తెలుసని, ఆ సమయంలో జరిగిన అవమానాలను మర్చిపోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను అరెస్టులు, కేసులతో ఇబ్బంది పడుతున్నప్పుడు పార్టీలోని ముఖ్య నేతలు ఎలా ప్రవర్తించాలో తనకు గుర్తుందని పరోక్షంగా చురకలు అంటించారు.

**కేటీఆర్ టార్గెట్ గా విమర్శలు**

తన సోదరుడు కేటీఆర్ రాజకీయ రంగ ప్రవేశంపై కూడా కవిత ఘాటుగా స్పందించారు. కేటీఆర్ నేరుగా అమెరికా నుంచి వచ్చి పార్టీలో చేరారని కానీ తాను మాత్రం 2006 లోనే తెలంగాణ జాగృతి స్థాపించి క్షేత్రస్థాయిలో పోరాడాలని గుర్తు చేశారు. తన ఫోన్ తో పాటు తన భర్త చివరకు ఇంట్లో పని చేసే వారి ఫోన్లను కూడా ట్యాప్ చేశారని కవిత సంచలన ఆరోపణ చేశారు. ఒకవేళ కేటీఆర్ భార్య ఫోన్ ట్యాప్ ఐతే ఆయన ఊరుకుంటారా అని సూటిగా ప్రశ్నించారు.

**బీఆర్ఎస్ లో మహిళలకు అన్యాయం**

పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మహిళా నేతలకు సరైన గుర్తింపు లభించలేదని కవిత అసహనం వ్యక్తం చేశారు. గతంలో 42 కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో ఒక్క మహిళకు కూడా అవకాశం ఇవ్వకపోవడానికి తాను అప్పుడే కేసీఆర్ ను నిలదీశానని ఆమె వెల్లడించారు. ఉద్యమ సమయంలో నరకం అనుభవించిన మహిళా కార్యకర్తలకు నేడు గుర్తింపు లేదని ఆవేదన చెందారు. 2025 ముగింపు వేళ కవిత ఇచ్చిన ఈ ఇంటర్వ్యూ బీఆర్ఎస్ పార్టీలో మునుపెన్నడూ లేని విధంగా చీలికలను స్పష్టం చేస్తోంది. వచ్చే ఏడాది ఆమె పార్టీపై మరింత దూకుడుగా వ్యవహరించే సూచనలు కనిపిస్తున్నాయి.

# సీబీఎస్ఈ 10, 12వ తరగతి బోర్డు పరీక్షల రీషెడ్యూల్

న్యూ ఢిల్లీ, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ 10వ మరియు 12వ తరగతుల బోర్డు పరీక్షల సవరించిన తేదీలను ప్రకటించింది. సీబీఎస్సీ ప్రకారం, ముందుగా వచ్చే ఏడాది మార్చి 3న జరగాల్సిన 10వ తరగతి విద్యార్థుల పరీక్ష ఇప్పుడు వచ్చే ఏడాది మార్చి 11న జరుగుతుంది. 12వ తరగతి పరీక్ష తేదీని ఏప్రిల్ 10వ తేదీకి మార్చారు, ఇది మార్చి 3, 2026న జరగాల్సి ఉంది. పరిపాలనా కారణాల వల్ల తేదీలను తిరిగి షెడ్యూల్ చేసినట్లు బోర్డు తెలిపింది. ఈ సమాచారాన్ని సంబంధిత విద్యార్థులు మరియు తల్లిదండ్రులందరికీ తెలియజేయాలని సీబీఎస్సీ పాఠశాలలను కోరింది.

# యాసంగి అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు

**రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దు**



ములుగు జిల్లా, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): జిల్లాలో ప్రస్తుత యాసంగి (రబీ) సీజన్ లో పంటల సాగు కోసం రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎవరూ ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సాఫీగా ఎరువుల పంపిణీ జరిగేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అన్ని సహకార సంఘాలలో మరియు ప్రైవేట్ డీలర్ల వద్ద యూరియా సహా ఇతర ఎరువులు అందుబాటులో ఉంచామని, పంట సాగు చేస్తున్న ప్రతి రైతుకు అందేవిధంగా పర్యవేక్షణ చేస్తున్నామని అన్నారు. ప్రస్తుతం ములుగు మండలంలో 137 Mts మల్లంపల్లి మండలంలో 68 Mts వెంకటాపూర్ మండలంలో 107 Mts గోవిందరావుపేట్ మండలంలో 40Mts మంగపేట మండలంలో 214 Mts తాడ్వాయి మండలంలో 29 Mts ఎటునాగారం మండలంలో 46 Mts వాజేడు మండలంలో 22Mts వెంకటాపురం మండలంలో 126 Mts కన్నాయిగూడెం మండలంలో 22 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉ ంచడం జరిగిందన్నారు. యురియాతో పాటు కాంప్లెక్స్ ఎరువు డీ.ఏ.పీ ,ఎం.ఓ.పీ ఎరువులు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఎరువుల పంపిణీ కేంద్రాలలో ప్రతీ చోట కౌంటర్లను నెలకొల్పి రైతులు వచ్చిన వెంటనే వారికి ఎరువులు అందించేలా చర్యలు తీసుకుంటున్నాము. ఎట్టి పరిస్థితుల్లోనూ జిల్లాలో ఎక్కడ కూడా యూరియా, ఇతర ఎరువుల కొరత తలెత్తకుండా ముందస్తుగానే జిల్లా అవసరాలకు సరిపడా ఎరువుల నిల్వలు తెప్పిస్తున్నామని అన్నారు. కోరిన వెంటనే ప్రభుత్వం రైతుల అవసరాలకు అనుగుణంగా పూర్తి స్థాయిలో యూరియా నిల్వలను జిల్లాకు కేటాయిస్తోందన్నారు. యూరియా ఎరువుల పంపిణీ ప్రక్రియను ప్రతిరోజూ పర్యవేక్షించడం జరుగుతోందని, పంపిణీలో లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీగా వ్యవహరిస్తున్నాము. పంట సాగు చేసే ప్రతి రైతుకు ఎలాంటి ఇబ్బంది జరగకుండా వారి అవసరాలకు సరిపడా యూరియాను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రైతులు ఎవరైనా యూరియా సరఫరాలో సమస్యలు ఎదుర్కొంటే సమీప వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. అయితే ఒకేసారి యూరియా కొనుగోలు చేయకుండా, శాస్త్రీయ పద్ధతిలో అవసరానికి సరిపడా మాత్రమే వినియోగించాలని రైతులను కోరారు. ఎవరైనా ఎరువుల కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం, దారి మళ్ళించడం వంటి అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, యూరియా పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపైనా చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు.

# అగ్రంపహాడ్ సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లపై సమీక్ష

**శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి**



హనుమకొండ, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): బుధవారం ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్ శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర ప్రాంగణం నందు జాతర ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ తో కలిసి పరకాల శాసనసభ్యుల రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అంతకుముందు శ్రీ సమ్మక్క సారలమ్మ తల్లులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతర విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా శాంతి భద్రతల పర్యవేక్షణ బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. భక్తుల సౌకర్యార్థం త్రాగు నీరు ఏర్పాటు చేయడం దేవాలయ జాతర ప్రాంగణము, వాహనాలు పార్కింగ్ స్థలములలో లైటింగ్ ఏర్పాటు మరియు అమ్మవార్ల గద్దెల చుట్టూ లైటింగ్ డెకరేషన్ ఏర్పాటు చేయటం నిరంతర విధ్యుత్ సరఫరా ఏర్పాటు తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు, 108 వాహనం అదుబాటులో ఉంచుట, 27బి7 వైద్యులు అందుబాటులో ఉండాలని, శానిటేషన్, జాతరకు వచ్చే అన్ని లింకు రోడ్ల మరమ్మతు, తదితర అంశాలపై చర్చించారు.

# 4వ బెటాలియన్లో ఘనంగా పదవీ విరమణ కార్యక్రమం



మామునూరు, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): వరంగల్ జిల్లా, మామనూర్ నాలుగు బెటాలియన్ లో డిసెంబర్ 31న బెటాలియన్ నందు వి.జైపాల్ రెడ్డి గారు ఏఆర్ఎస్ఐగా విధులు నిర్వర్తించి పదవీ విరమణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా కమాండెంట్ శ్రీ డి.శివప్రసాద్ రెడ్డిగారు హాజరు అయ్యి పదవీ విరమణ పొందుతున్న ఏఆర్ఎస్ఐ వి.జైపాల్ రెడ్డికి శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా కమాండెంట్ గారు మాట్లాడుతూ 41సంవత్సరాల సుధీర్ఘ కాలం పోలీసు శాఖలో విధులు నిర్వర్తించి తన సర్వీస్ లో ఎలాంటి రిమార్క్స్ లేకుండా పదవీ విరమణ పొదుతున్నారు. పదవీ విరమణ తర్వాత తన కుటుంబంతో సంతోషంగా ఆయురారోగ్యాలతో ఉండాలని తెలపడం జరిగింది. వారికి రావాల్సిన సిసిఎస్ నగదు మొత్తాన్ని చెక్కు రూపంలో అందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్స్ శ్రీనివాస రావు, వీరన్న రిజర్వు ఇన్స్పెక్టర్స్ విజయ్, రవిసర్వర్, రాజ్ కుమార్, రామ్ ప్రసాద్ అధికారులు మరియు బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

# మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర దృష్ట్యా ముందడుగు

## నార్లాపూర్ నూతన పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించిన సీతక్క






తాడ్వాయి, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా ఎస్.ఎస్. తాడ్వాయి మండలం మేడారం నందు నూతనంగా నిర్మించిన నార్లపూర్ పోలీస్ స్టేషన్‌ను బుధవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క , జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన లతో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ నూతన పోలీస్ స్టేషన్ ప్రారంభం మేడారం మహా జాతర దృష్ట్యా ఎల్లప్పుడూ ప్రజలకు భక్తులకు గుత్తికొయా గిరిజన ప్రజలకు అందుబాటులో ఉంటూ, శాంతి భద్రతల పరిరక్షణకు ఎంతో ఉ పయోగకరంగా ఉంటుందని తెలిపారు. జాతర సమయంలో లక్షలాది భక్తులు తరలివచ్చే నేపథ్యంలో ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వేగవంతమైన పోలీస్ సేవల అందించడంలో ఈ స్టేషన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ పి మాట్లాడుతూ జిల్లాలో పోలీసింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ నూతన స్టేషన్‌ను ఏర్పాటు చేసినట్లు, ఇది ప్రజలకు మరింత చేరువైన, సమర్థవంతమైన సేవలకు నాంది పలుకుతుందని అన్నారు. పోలీస్ స్టేషన్ లో స్టేషన్ హౌస్ అధికారి ఎస్ఐ హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ స్థాయిలలో సుమారుగా 30 మంది పనిచేయనున్నారని, నార్లాపూర్ పోలీస్ స్టేషన్ హౌస్ అధికారిగా ఎస్ ఐ ఏ. కమలాకర్ విధులు నిర్వహించనున్నారని, పస్రా పరిధిలో ఈ స్టేషన్ పనిచేస్తుందని పస్రా సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా దయాకర్ పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం మంత్రి సీతక్క, కలెక్టర్, ఎస్ పి లతో కలిసి మేడారం సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ శివం ఉపాధ్యాయ, ఏఎస్పీ ఏటూరునాగారం మనన్ బట్ ,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, స్థానిక సర్పంచ్ పిరిల భారతీ వెంకన్న, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులను పూర్తి చేయాలి

**గట్టమ్మ ఆలయం వద్ద నూతన పార్కింగ్ ఏర్పాటు**

**రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క**



ములుగు జిల్లా, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): జిల్లా సమీపంలోని గట్టమ్మ గుట్ట వద్ద నిర్మించనున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేదతీరే అవకాశం ఉందని, తల్లికి తలవంచందే భక్తులు ముందు కదలరని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం ములుగు జిల్లా కేంద్రంలోని గట్టమ్మ దేవాలయం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను, ఆర్టీసీ బస్సులు, ప్రయివేట్ వాహనాల పార్కింగ్ స్థలాలను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క , జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్, డి ఎఫ్ ఓ రాహూల్ కిషన్ జాదవ్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే భక్తులు, పర్యాటకులు ముందుగా గట్టమ్మ తల్లిని దర్శించుకున్న అనంతరమే ముందు సాగుతారని, జాతీయ రహదారి ఆనుకొని ఉన్న గట్టమ్మ తల్లి ఆలయం వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని, నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారుల ను ఆదేశించారు. పార్కింగ్ నుంచి ఆలయ మార్గం వరకు ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల సాఫీగా రాకపోకలు జరిగేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు. పార్కింగ్ ప్రాంతంలో వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్పష్టమైన రేడియం స్టిక్కర్లు, దిశానిర్దేశక సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని, రాత్రి సమయంలో కూడా స్పష్టంగా కనిపించేలా సూచికలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, ఆర్ అండ్ బి శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# విద్య రంగా సమస్యలను పట్టించుకోని పాలకులు

**విద్యార్థి అమరవీరుల పోరాటాలను కొనసాగిస్తాం**

**ఎస్ఎఫ్ఐ 56వ ఆవిరవే దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ**

**మంద శ్రీకాంత్ జిల్లా ప్రధాన కార్యదర్శి**



శాయంపేట, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): విద్యార్థి అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తామని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ అన్నారు. బుధవారం రోజున శాయంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భారత విదార్థి ఫెడరేషన్ ఎస్.ఎఫ్.ఐ 56 వ ఆవిరావే దినోత్సవం సందర్భంగా స్వాతంత్రం ప్రజాస్వామ్యం సోషలిజం లక్ష్యాలు కలిగిన జెండాను ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వతంత్ర పోరాట వారసత్వంతో 1970 కేరళ రాష్ట్రంలోని త్రివేంద్రంలో డిసెంబర్ 31న ,అధ్యయనం పోరాటం అనే నినాదంతో ఎస్ఎఫ్ఐ ఏర్పడినప్పడి నుండి 55 సంవత్సరాల కాలంలో దేశంలో విద్యార్థి ఉద్యమాలకు ఎస్ఎఫ్ఐ నాయకత్వం వహించిందని ఎన్నో విరోచీత పోరాటాలు విద్యార్థుల పక్షాన చేసిందనీ ప్రపంచ వ్యాప్త ప్రజాస్వామ్య ఉద్యమాలకు తన మద్దతును ప్రకటించి సంఘీభావాన్ని తెలిపిందని అన్నారు వరంగల్ జిల్లా విద్యార్థి ఉద్యమంలో అమరుడైన కామ్రేడ్ లక్ష్మీనారాయణ ఆర్ట్స్ కళాశాల విద్యార్థి అని గుర్తు చేశారు

ఈ దేశంలో అతిపెద్ద విద్యార్థి ఉద్యమాన్ని తన భుజస్కందాలపై వేసుకొని నడుపుతున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘంలో చేరాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ శాయంపేట మండల అధ్యక్షులు ఇస్మాయిల్ పవన్ కుమార్ సమీర్ భరత్ మహేందర్ అయాన్ ఆశ్రిత భాను శ్రీ యాస్మిన్ సానియా నజ్రిన్ అనూష ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

# టెట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): టెట్ పరీక్షలు అభ్యర్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న కీలకమైన పరీక్షలు కావడంతో ఎలాంటి లోపాలకు తావు లేకుండా పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో టెట్ పరీక్షల నిర్వహణపై కలెక్టర్, అధనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అధనపు కలెక్టర్ విద్యచందన,సంబంధిత శాఖల అధికారులతో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందరరేగా కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 2026లో 4, 5, 6, 8, 9, 11, 19, 20 తేదీలలో టెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9.00 గంటల నుండి 11.30 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 2.00 గంటల నుండి 4.30 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయని చెప్పారు. జిల్లాలో టెట్ పరీక్షలకు మొత్తం 1017 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని కలెక్టర్ వెల్లడించారు. టెట్ పరీక్షల నిర్వహణ నిమిత్తం జిల్లా వ్యాప్తంగా రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సుజాతనగర్ మండలం అబ్దుల్ కలాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజికల్ సైన్సెస్, పాల్వంచ మండలం అనుబోస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నందు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరీక్షల నిర్వహణలో అన్ని శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేసి పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని సూచించారు. పరీక్షల పర్యవేక్షణ కోసం ముగ్గురు అబ్జర్వర్లు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించడం జరిగిందని తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు నిరంతర పర్యవేక్షణ చేపట్టే విధంగా అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో 163 బి ఎన్ ఎస్ ఎస్ సెక్షన్ అమలు చేయాలని తెలిపారు. పరీక్షలు పూర్తిగా ఆన్లైన్ విధానంలో నిర్వహించబడతాయని కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో అన్ని కంప్యూటర్లు, నెట్‌వర్క్ కనెక్టివిటీ సక్రమంగా పనిచేసేలా ముందుగానే పరిశీలించాలని, సాంకేతిక లోపాలు తలెత్తకుండా ఐటీ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. జనవరి 3వ తేదీన మాక్ టెస్ట్‌ను అబ్జర్వర్ల పర్యవేక్షణలో నిర్వహించి, అన్ని కంప్యూటర్లు సరిగా పనిచేస్తున్నాయా లేదా ధృవీకరించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లోకి ప్రవేశించే ప్రతి ఒక్కరినీ నిశితంగా పరిశీలించిన అనంతరమే అనుమతించాలని తెలిపారు. అభ్యర్థులు ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా చెల్లుబాటు అయ్యే ఫోటో గుర్తింపు కార్డు తప్పనిసరిగా తమ వెంట తీసుకురావాలని, గుర్తింపు కార్డు పరిశీలించిన తరువాతే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని తెలిపారు. అభ్యర్థులకు పరీక్షా హాల్ వివరాలు సులభంగా తెలిసేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో త్రాగునీరు, శౌచాలయాలు తదితర మౌలిక సదు-పాయాలు కల్పించాలని చెప్పారు. దివ్యాంగ అభ్యర్థులకు అవసరమైన సహాయకులను నియమించాలని సూచించారు. పరీక్షల సమయంలో మెడికల్ క్యాంపులు సిద్ధం చేసి, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. అభ్యర్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ బస్సులు నడపాలని సంబంధిత అధికారులను సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, ముందుగానే జనరేటర్లు, ఇన్వర్టర్లు అందుబాటులో ఉన్నాయా లేదా పరిశీలించుకోవాలని తెలిపారు. పరీక్ష ప్రారంభానికి ముందే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు గంటన్నర ముందే చేరుకోవాలని, పరీక్ష సమయానికి 10 నిమిషాల ముందే గేట్లు మూసివేయాలని తెలిపారు. ఒకసారి గేట్లు మూసిన తరువాత ఎవరికీ లోపలికి అనుమతి ఉండదని, అలాగే పరీక్ష సమయం పూర్తయ్యే వరకు ఎవరినీ బయటకు అనుమతించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇన్విజిలేటర్లు పూర్తి బాధ్యతతో విధులు నిర్వహించాలని, పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు లేదా లోపాలు తలెత్తితే సంబంధితులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టెట్ పరీక్షలు ప్రశాంతంగా, న్యాయంగా, పారదర్శకంగా నిర్వహించే దిశగా అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఈ సందరరేగా స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి, ఇంటర్మీడియట్ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, వైద్యశాఖ అధికారి తుకారాం రాథోడ్ అనుబోస్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవికుమార్, అబ్దుల్ కలాం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దయాకర్ రావు, అబ్జర్వర్లు, పోలీస్ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యాప్‌తో తేలికగా యూరియా కొనుగోలు

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జనగాం జిల్లా, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): జిల్లాలో రైతులకు యూరియా ఎరువు సరఫర పారదర్శకంగా, వేగవంతంగా పంపిణి అవుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ జనగాం మండలంలోని పలు ఎరువుల విక్రయ కేంద్రాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందరరేగా కలెక్టర్ జిల్లాలో అమలులో ఉన్న ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా యూరియా పంపిణీ విధానంను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులు యాప్ ద్వారా పొందిన యూరియా బుకింగ్ ఐడీలను ధృవీకరించి, బుకింగ్ ప్రక్రియ ను పరిశీలించారు. అనంతరం రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి, యాప్ ద్వారా యూరియా బుకింగ్ ప్రక్రియ పైన రైతుల అభిప్రాయలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా డీలర్ లాగిన్‌లో జరిగే యూరియా అమ్మకాల నిర్ధారణ ప్రక్రియను కూడా కలెక్టర్ సవివరంగా పరిశీలించారు. ఈ సందరరేగా కలెక్టర్ స్వయంగా డీలర్ లాగిన్‌లో అమ్మకాల నిర్ధారణ ప్రక్రియను నిర్వహించి, యాప్ ద్వారా యూరియా పంపిణీ పూర్తిగా పారదర్శకంగా జరుగుతోందని స్పష్టం చేశారు. యూరియా బుకింగ్ చేయని రైతులు నేరుగా విక్రయ కేంద్రాలకు వచ్చిన సందరాల్లో వారికి ఇబ్బందులు కలగకుండా, ప్రతి యూరియా లభ్యత ఉన్న కేంద్రంలో వాలంటీర్లను నియమించి, అక్కడికక్కడే ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా బుకింగ్ చేయించే విధంగా ఇప్పటికే అవసరమైన చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే జిల్లాలో యూరియా పంపిణీ మరింత వేగవంతంగా సాగేందుకు, రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అదనపు విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసి, రైతులకు వేగంగా యూరియా అందేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వెల్లడించారు. ఈ చర్యల ద్వారా రైతులకు వేచిచూడే సమయం తగ్గి, సరఫరా మరింత సజావుగా కొనసాగుతుందని తెలిపారు. బుకింగ్ ఐడి గడువు ముగిసిన రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. బుకింగ్ ఐడి గడువు ముగిసిన తర్వాత 24 గంటల హోల్డింగ్ పీరియడ్ అనంతరం రైతులు తిరిగి యూరియాను బుక్ చేసుకునే అవకాశం ఉందని, రైతులు తమ కోటా కోల్పోయారని భావించాల్సిన అవసరం లేదన్నారు. రైతుల సౌకర్యార్థం జిల్లాలోని ప్రధాన యూరియా విక్రయ కేంద్రాల వద్ద షామియానాలు ఏర్పాటు చేయడం, తాగునీటి సదుపాయాలు కల్పించడం వంటి ఏర్పాట్లు ఇప్పటికే చేపట్టినట్లు తెలిపారు. ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ వినియోగం గ్రామీణ రైతులకు సులభంగా అర్థమయ్యేలా 5 నుండి 6 సరళమైన దశలుగా యూరియా బుకింగ్ విధానాన్ని ప్రతి విక్రయ కేంద్రంలో ప్రదర్శించేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందరరేగా జనగాం మండలంలోని ARSK--III, ARSK-I జనగాం, PACS జనగాం కేంద్రాలను కలెక్టర్ సందర్శించి, అక్కడ యూరియా కొనుగోలు చేసిన రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. యాప్ ద్వారా యూరియా బుకింగ్ ప్రక్రియ సులభంగా ఉందని, పారదర్శకత పెరిగిందని రైతులు తమ సంతృప్తిని వ్యక్తం చేశారు. చివరిగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రతి ఎరువుల విక్రయ కేంద్రంలో సరిపడా యూరియా నిల్వలు ముందుగానే ఉంచి, రైతులకు ఇబ్బందులు కలగకుండా ఉదయం 6.00 గంటల నుంచే అన్ని విక్రయ కేంద్రాలు తెరిచి ఉంచే విధంగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. రైతుల అవసరాలకు ప్రాధాన్యత ఇస్తూ యూరియా సరఫరాలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి అంబిక సోని, సహాయ సంచాలకులు (వ్యవసాయం) అపర వ్యవసాయ అధికారి విజయ్ రెడ్డి పాల్గొన్నారు.

# కేసీఆర్ మళ్లీ ఎర్రవల్లి బాట




హైదరాబాద్, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): జనవరి 2వ తేదీ నుంచి తిరిగి ప్రారంభం కానున్న తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో కెసిఆర్ పాల్గొంటారని ఆశగా ఎదురుచూసిన గులాబీ శ్రేణులకు పార్టీ అధినేత షాక్ ఇవ్వబోతున్నారా? ఇకపై తానే స్వయంగా రంగంలోకి దిగి ప్రభుత్వం తోలు ఒలిచేస్తానన్న కేసీఆర్ మళ్లీ సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారా? తాజాగా ఆయన హైదరాబాద్‌ను వీడి ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు చేరుకోవడంతో అవుననే సమాధానం వినిపిస్తోంది. సుదీర్ఘ విరామం తర్వాత ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌ను వీడి హైదరాబాద్ నంది నగర్ నివాసానికి వచ్చి అసెంబ్లీ తొలిరోజు సభకు హాజరైన కేసీఆర్ నిన్న రాత్రి తిరిగి ఫామ్‌హౌస్‌కు వెళ్లిపోయారు. దీంతో ఆయన ఎల్లుండి జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొంటారా? లేదా? అనే దానిపై ఉత్కంఠ నెలకొన్నది. కేసీఆర్ ఈ నెల 21 తెలంగాణ భవన్‌లో జరిగిన బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇప్పటివరకు ఓ లెక్క రేపటి నుంచి మలో రెక్క నేనే స్వయంగా రంగంలోకి వస్తున్నా.. ప్రజలతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం తోలు తీస్తానంటూ స్ట్రాంగ్ కామెంట్స్ చేశారు. అటునుంచి ఎర్రవెల్లి వెళ్లిపోయిన కేసీఆర్ గత ఆదివారం హుటాహుటిన హైదరాబాద్‌కు వచ్చారు. సోమవారం ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారు. సభలో కేవలం 3 నిమిషాలు మాత్రమే ఉన్న గులాబీ బాస్ రిజిస్టర్‌లో సంతకం పెట్టి తిరిగి నందినగర్ నివాసానికి చేరుకున్నారు. నిన్న పార్టీ శ్రేణులతో కలిసి వారితో ఫొటోలు దిగిన అధినేత.. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్లను ప్రకటించారు. ఆ వెంటనే ఎర్రవల్లికి వెళ్లిపోయారు. దీంతో కేసీఆర్ ఇలా వచ్చి వెళ్లిపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల కేసీఆర్ వ్యాఖ్యలు విన్న ప్రజలు తిరిగి వింటేజ్ కేసీఆర్‌ను చూస్తున్నామనే అభిప్రాయం వ్యక్తం చేశారు. ముఖ్యంగా కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై స్పందిస్తూ రేవంత్‌రెడ్డి, చంద్రబాబులను టార్గెట్ చేయడంతో రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా కేసీఆర్ సెంటర్ ఆఫ్ ది ఎట్రాక్షన్‌గా మారిపోయారు. ఈ క్రమంలో స్టేట్ పాలిటిక్స్ సైతం నీటి అంశం చుట్టే చక్కర్లు కొడుతుండటంతో అసెంబ్లీ వేదికగా కేసీఆర్ తన సత్తా చూపబోతున్నారని కాంగ్రెస్, బీజేపీలను కార్నర్ చేయబోతున్నారనే చర్చ సాగుతోంది. ఇలాంటి తరుణంలో ఆయన ఫామ్‌హౌస్‌కు చేరుకోవడం బీఆర్ఎస్ శ్రేణులను తీవ్ర నిరాశకు గురి చేసింది.

# జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జనగాం జిల్లా, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు కలెక్టర్ కార్యాలయానికి వచ్చే వారు బొకేలు, పుష్ప గుచ్చాలు, శాలువాలు తీసుకొని రావద్దని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపు నిచ్చారు.బీనూతన సంవత్సరం సందర్భంగా అధికారులు.. బొకేలు, శాలువాలు, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలపడం సహజమని, అయితే వాటికి బదులుగా పేద విద్యార్థులకు ఉపయోగపడేలా నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, దుప్పట్లు తీసుక రావలిసిందిగా కలెక్టర్ సూచించారు. పేద విద్యార్థులకు చేదోడువాదోడుగా నిలవాలని, వాటిని త్వరలో విద్యార్థులకు పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. పేద పిల్లలకు విద్యా సామాగ్రి ఇవ్వడం ద్వారా పిల్లల చదువుకు ఉపయోగ పడుతాయని, చలి కాలం దుప్పట్లు అందిచడం వలన వారి ఆరోగ్యరక్షణకు ఉపయోగపడతాయని తెలిపారు.

# జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

### బొకేలు, శాలువాల బదులు ఉపయోగపడే సామగ్రి అందించాలి

## జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న నూతన సంవత్సరం జిల్లా ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం, శాంతి, సమృద్ధి తీసుకురావాలని, జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ సందరరేగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడానికి తనను కలెక్టర్ కార్యాలయానికి కలిసేందుకు వచ్చే అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు బొకేలు, పుష్పగుచ్ఛాలు, శాలువాలు తీసుకొని రావద్దని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. నూతన సంవత్సరం సందరరేగా బొకేలు, శాలువాలు, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలపడం సహజమేనని, అయితే వాటికి బదులుగా పేద విద్యార్థులకు ఉపయోగపడే నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, తదితర అవసరమైన సామగ్రిని అందించాలని ఆయన సూచించారు. ఈ విధంగా అందించే సామగ్రి పేద విద్యార్థుల చదువుకు ఎంతగానో ఉపయోగపడుతుందని, సేకరించిన విద్యా సామగ్రిని త్వరలో అర్హులైన విద్యార్థులకు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికితే డైరెక్ట్‌గా జైలుకే

### 120 ప్రాంతాల్లో భారీగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

### మందుబాబులకు సీపీ సజ్జనార్ వార్నింగ్






హైదరాబాద్, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): న్యూ ఇయర్ వేడుకల వేళ మందుబాబులకు మరోసారి హెచ్చరికలు జారీ చేశారు హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్. మద్యం తాగి వాహనాలు నడుపుతూ రోడ్లపైకి వస్తే ఉపేక్షించేది లేదన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చక్రవ్యూహంలో దొరికితే డైరెక్ట్ చంచల్‌గూడ జైలుకే వెళ్తారు అని హెచ్చరించారు. న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో మరోసారి వీసీ సజ్జనార్ స్పందిస్తూ నగరంలోని 120 ప్రాంతాల్లో బుధవారం రాత్రి ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ఉంటాయన్నారు. మద్యం తాగి పట్టుబడితే భారీ జరిమానా, వాహనాలను జప్తు, జైలు శిక్ష, డ్రైవింగ్ లైసెన్స్ రద్దుచేస్తామని తెలిపారు. ఈ తనిఖీలు కేవలం ఈ రోజుకే పరిమితం కాకుండా జనవరి మొదటి వారం అంతా కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు. తనిఖీల్లో మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడితే భారీ జరిమానా విధించడంతో పాటు, వాహనాన్ని సీజ్ చేస్తామని, అలాగే కోర్టు ద్వారా జైలు శిక్ష, డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసే ప్రక్రియను చేపడతామని హెచ్చరించారు. ర్యాష్ డ్రైవింగ్, బహిరంగ ప్రదేశాల్లో న్యూసెన్స్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. చక్రవ్యూహంతో సిటీలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు జరుగుతాయి. చక్రవ్యూహం నుంచి ఎవరూ తప్పించుకోలేరు. చక్రవ్యూహంలో దొరికితే డైరెక్ట్ చంచల్‌గూడ జైలుకే వెళ్తారు. తాగి డ్రైవింగ్ చేస్తే నో షార్ట్ కట్స్ నో స్మార్ట్ మూవ్స్ అంటూ హెచ్చరించారు. అలాగే, కేవలం డ్రంక్ అండ్ డ్రైవ్ మాత్రమే కాకుండా అతివేగంగా వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్ చేయడం, బహిరంగ ప్రదేశాల్లో నలుగురికి ఇబ్బంది కలిగించేలా న్యూసెన్స్ చేయడం వంటి పనులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు తెలిపారు. మద్యం సేవించిన వారు బాధ్యతాయుతంగా వ్యవహరించి, స్వయంగా డ్రైవింగ్ చేయకుండా క్యాబ్ సేవలను లేదా డ్రైవర్లను ఆశ్రయించాలని సూచించారు. కొత్త సంవత్సర వేడుకలను ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో కలిసి క్షేమంగా, సంతోషంగా జరుపుకోవాలని పోలీస్ యంత్రాంగం కోరింది. ర్యాష్ డ్రైవింగ్, బహిరంగ ప్రదేశాల్లో న్యూసెన్స్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# గులాబీ గూటికి జంపింగ్ నేతలు




తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాజకీయాలు రసవత్తరంగా నడుస్తున్నాయి. ఇన్ని రోజులేమో.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీలు ఒక్కొక్కరిగా కాంగ్రెస్, బీజేపీ కండువాలు కప్పుకుంటూ గులాబీ బాస్ కేసీఆర్కు షాకుల మీద షాకులు ఇచ్చిన విషయం తెలిసిందే. కాగా.. ఎండలు తగ్గిపోయి వానలు మొదలైనట్టుగా ఇప్పుడు వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. కాంగ్రెస్, బీజేపీలోకి వెళ్లిన ఎమ్మెల్యేలు, మాజీలు మెల్లిగా ఇంటి బాట పడుతున్నట్టు సూచనలు అందుతున్నాయి. అధికార పార్టీలో అయితే అన్ని విధాలా హాయిగా ఉంటుందని జంప్ కొట్టినా ప్రశాంతత లేకుండా పోయిందని వాపోతున్నట్టు సమాచారం. పాత కాంగ్రెస్ నేతలతో నియోజకవర్గాల్లో తలనొప్పుల కారణంగా అక్కడ ఉండలేక తిరిగి బీఆర్ఎస్ మీద మనసు పారేసుకుంటూ కలకలం సృష్టిస్తున్నారు. అటు బీజేపీ హవాకు, కాంగ్రెస్ విజయాలకు బ్రేక్ వేసి వచ్చే ఎన్నికల్లో గెలవాలంటే ఘర్ వాపసీ షురూ చేయాల్సిందేనని కారులో కూడా చర్చ జరుగుతున్నట్లు సమాచారం. తెలంగాణలో ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారం రాజకీయాల్లో కీలక మలుపు తీసుకుంటోంది. బీఆర్ఎస్ నుంచి పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ నోటీసులు జారీ చేశారు. అందులో ఐదుగురు ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే చెప్పుకొచ్చారు. వాళ్లు పార్టీ మారారన్న ఆధారాలు లేవని ఇప్పటికీ వాళ్లు కారు పార్టీలోనే ఉన్నారంటూ చెప్పడం పొలిటికల్ ట్విస్ట్ ఇచ్చింది. అలాగే మిగిలిన ఐదుగురు ఎమ్మెల్యేలలో దానం నాగేందర్, కడియం శ్రీహరి తప్ప ముగ్గురిని కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే చూపిస్తారన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి. దానం, కడియంలపై మాత్రం వేటు పడుతుందని లేదు వాళ్లు రాజీనామా చేస్తారంటూ ప్రచారం జరగుతుంది. మరోవైపు చాలారోజుల గ్యాప్ తర్వాత మాజీ సీఎం కేసీఆర్ క్షేత్రస్థాయి రాజకీయాల్లో యాక్టివ్ అయ్యారు. దీంతో అధికార కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ దూకుడుగా వ్యవహరిస్తోంది. నీటి పంపకాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేసేలా కేసీఆర్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారంటూ చెప్పుకుంటున్నారు. ఓవైపు పార్టీ ఫిరాయింపు తలనొప్పులు, మరోవైపు కేసీఆర్ యాక్టివ్ కావడంతో అటు నుంచి ఇటు దూకిన నేతల్లో టెన్షన్ మొదలైంది. ఒకవేళ వచ్చే ఎన్నికల్లో కారు దూసుకుపోతే తమకు ఇబ్బందులు తప్పవన్న ఆలోచనలు పడినట్లు సమాచారం. అందుకే మళ్లీ కారెక్కేందుకు జంపింగ్ నేతలంటూ క్యూ కట్టినట్లు అంతర్గత చర్చలు మొదలయ్యాయి.

**గూడెం మహిపాల్రెడ్డి..**

గతేడాది బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్లోకి ఫిరాయించిన చివరి ఎమ్మెల్యేగా పేరు తెచ్చుకున్న పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి త్వరలోనే కారెక్కబోతున్నట్లు విశ్వసనీయ సమాచారం. మహిపాల్ రెడ్డి కాంగ్రెస్లో జాయిన్ అయినప్పటికీ మనసంతా గులాబీ తోటలోనే ఉందనేది స్పష్టం అంటున్నారు పరిశీలకులు. నియోజకవర్గ అభివృద్ధి కోసమంటూ కాంగ్రెస్లోకి అడుగుపెట్టిన మహిపాల్ రెడ్డికి అక్కడి పాత నేతలే అడ్డంకులు సృష్టిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అప్పట్లో తన క్యాంప్ కార్యాలయంలో కేసీఆర్ ఫోటో తీసేదే లేదని పట్టుబట్టారు. పైగా ఇప్పుడు తానున్న పార్టీ మీదే అప్పుడప్పుడు అవాకులు చవాకులు పేలుతున్నారు. సందర్భం చేసుకుని మరీ కేసీఆర్ను కలుస్తున్నారట. ఇవన్నీ చూసే గూడెం మళ్లీ కారెక్కుతారంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది.

**బండ్ల కృష్ణమోహన్రెడ్డి..**

ఇక గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటికీ అక్కడ నియోజకవర్గ గొడవలు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయంటున్నారు. గద్వాలలో ఓ మహిళా కాంగ్రెస్ నేతతో ఆయనకు క్షణం పడడంలేదని టాక్. దీంతో ఆయన విసుగుచెంది ఏకంగా పోలీసు స్టేషన్కు వెళ్లి తాను పార్టీ మారినట్లు దుష్ప్రచారం చేస్తున్నారంటూ ఎఫ్ఐఆర్ కూడా చేయించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ గూటికి చేరిన కృష్ణమోహన్ రెడ్డి ఫిరాయింపుల కేసు విచారణ జరుగుతున్న క్రమంలో తాను బీఆర్ఎస్లోనే ఉన్నానని, పార్టీ మారలేదని చెప్పారు. అసెంబ్లీ స్పీకర్ కూడా అదే అంశాన్ని తన జడ్జిమెంట్లో చెప్పారు. వాటికి తగినట్టుగానే బండ్ల కూడా అడుగులు వేస్తున్నారంటున్నారు. ఫిరాయింపు తలనొప్పి, ప్రభుత్వంపై వ్యతిరేక పవనాలు, సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ హైప్, కేసీఆర్ రీఎంట్రీ ఇవన్నీ ఆలోచించే బండ్ల తిరిగి బీఆర్ఎస్లోకి వస్తారంటూ బల్లగుద్ది చెప్తున్నారు.

**సైదిరెడ్డి, అరూరి, గువ్వల..**

ఇక బీఆర్ఎస్ వీడి బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యేల దుస్థితి ఉన్నది కాస్త ఊడింది. సర్వమంగళం పాడింది అన్నట్టే తయారైందని చెబుతున్నారు. ఏదో చేద్దామని జంప్ కొడితే.. అది కాస్త రివర్స్ అయి తమ పేరు తామే చెప్పుకునే స్థితికి వచ్చిందంటున్నారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్( హుజూర్నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు. ఈ ముగ్గురు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలు. బీఆర్ఎస్ హయాం లో విప్గా గువ్వల బాలరాజు, హౌసింగ్ సొసైటీస్ చైర్మన్గా అరూరి రమేశ్, ఎమ్మెల్యే హోదాలో సైదిరెడ్డి వైభోగం అనుభవించారు. అయితే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాక బీజేపీలో చేరారు. బీఆర్ఎస్ లో ఎమ్మెల్యేలుగా సాగించుకున్న హవా ఎంపీలై ఢిల్లీలో వెలుగుతామని భావించి అరూరి రమేశ్, శానంపూడి సైదిరెడ్డి బీజేపీలో చేరారు. వరంగల్ లోకసభ బీజేపీ అభ్యర్థిగా అరూరి, నల్లగొండ బీజేపీ అభ్యర్థిగా శానంపూడి పోటీచేసి ఓడిపోయిన విషయం తెలిసిందే. ఆ ఎన్నికల తర్వాత అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కూడా బీజేపీలో చేరారు. ఈ ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలకు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో వారు ప్రాతినిధ్యం వహించిన అసెంబ్లీ నియోజకవర్గాల్లో పరాభవం ఎదురైంది. హుజూర్నగర్ నియోజకవర్గంలో అయితే కనీసం ఒక్క సీటు కూడా బీజేపీ గెలుచుకోలేకపోయింది. అచ్చంపేటలో రెండు, వర్ధన్నపేటలో అరూరి రమేశ్ కష్టపడితే 4 సర్పంచ్ స్థానాలతో సరిపెట్టుకోవాల్సి దుస్థితి. దీంతో పార్టీ మారి తప్పు చేశామనే అంతర్మథనంలో కొట్టుమిట్టాడుతున్నారని త్వరలోనే గులాబీ గూటికి చేరుతారని ప్రచారం జరుగుతుంది.




# తెలంగాణ యువతకు నైపుణ్యాల జాతర

మొదటి పేజీ తరువాయి

నైపుణ్యం అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ యూనివర్సిటీ, 2025 డిసెంబర్ నాటికి 1000 మందికి పైగా విద్యార్థులకు శిక్షణ అందించింది. నైపుణ్య విద్యా రంగంలో ఇంత తక్కువ టైమ్లో ఈ స్థాయి లక్ష్యాన్ని అందుకోవటం విశేషం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో రాష్ట్రంలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పడింది. 2024 ఆగస్టు 1న యూనివర్సిటీకి శంకుస్థాపన జరిగిన విషయం తెలిసిందే. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్షిప్ విధానంలో దీన్ని నిర్వహిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ యూనివర్సిటీకి ఛాన్సలర్గా వ్యవహరిస్తుండగా, పరిశ్రమల రంగానికి చెందిన ప్రముఖులతో కూడిన బోర్డ్ ఆఫ్ మేనేజ్మెంట్ యూనివర్సిటీని పర్యవేక్షిస్తోంది. ఆనంద్మహీంద్రా బోర్డు చైర్మన్గా ఉన్నారు.

**ఆధునిక ల్యాబ్ బ్లాక్ ఏర్పాటు**

యూనివర్సిటీ వైస్ చాన్సలర్గా డా. వీ.ఎల్.వీ.ఎస్.ఎస్. సుబ్బారావు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. యూనివర్సిటీకి సంబంధించిన శాశ్వత క్యాంపస్ హైదరాబాద్ సమీపంలోని కందుకూరు మండలం - ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉంది. 57.8 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటవుతున్న ఈ క్యాంపస్లో 43 తరగతి గదులు, 600 పడకల హాస్టల్, 84 వేల చదరపు అడుగుల ఆధునిక ల్యాబ్ బ్లాక్ ఏర్పాటు చేస్తున్నారు. 2026 మార్చి నాటికి ఫేజ్-1 క్యాంపస్ను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. శాశ్వత క్యాంపస్ సిద్ధమయ్యే వరకు IIIT హైదరాబాద్లో తాత్కాలిక క్యాంపస్ ద్వారా శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

**కోర్సు పూర్తయిన వెంటనే ఉద్యోగాలు**

యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో లాజిస్టిక్స్, హెల్త్కేర్, లైఫ్ సైన్సెస్, ఫార్మా, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్ఫర్మేషన్ సైన్స్ వంటి రంగాల్లో శిక్షణ కోర్సులు నిర్వహిస్తున్నారు. షార్ట్ టర్మ్, సర్టిఫికేషన్ కోర్సుల ద్వారా విద్యార్థులకు కోర్సు పూర్తయిన వెంటనే ఉద్యోగాలు సాధించేందుకు వీలుగా నైపుణ్యాలు నేర్పుతున్నారు. మైక్రోసాఫ్ట్, రెడ్డీస్ ల్యాబ్స్, AIG హాస్పిటల్స్, అపోలో హాస్పిటల్స్, GMR కార్గో వంటి ప్రముఖ సంస్థలు యూనివర్సిటీతో భాగస్వామ్యం పంచుకుంటున్నాయి. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవటంతో ఈ సంస్థలన్నీ విద్యార్థులకు ఇంటర్న్షిప్లు, ప్రాక్టికల్ ట్రైనింగ్, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ముందుకు వచ్చాయి. 2026-27 విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ, పీజీ కోర్సులను ప్రారంభించేందుకు యూనివర్సిటీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. డిగ్రీలు కాకుండా జాబ్గ్యారంటీ లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, తెలంగాణ యువతకు ఉద్యోగ భవితను అందించే కీలక కేంద్రంగా మారనుంది.


# ప్రభుత్వ ఉద్యోగులకు ఊరట



హైదరాబాద్, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్న్యూస్ చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లుల కోసం 713 కోట్ల రూపాయలు విడుదల చేసింది. డిసెంబర్ మాసానికి సంబంధించిన బిల్లుల విడుదలకు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఆర్థిక శాఖ ద్వారా బుధవారం 713 కోట్ల రూపాయల బిల్లులు విడుదల అయ్యాయి. ఉద్యోగ సంఘాలకు ప్రతినెల 700 కోట్ల రూపాయలు విడుదల చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. జూన్ నెలాఖరులో183 కోట్ల రూపాయలు విడుదల చేసింది. ఆగస్టు నుంచి ప్రతినెల కనీసం 700 కోట్ల రూపాయల చొప్పున విడుదల చేస్తోంది. విడుదలైన బిల్లుల్లో గ్రాట్యూటీ, జీపీఎఫ్, సరెండర్ లీవ్, అడ్వాన్స్లు ఉన్నాయి.

# రామ్ లల్లా ప్రాణ ప్రతిష్ఠకు రెండేళ్లు

న్యూ ఢిల్లీ, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): ఉత్తరప్రదేశ్లోని అయోధ్య పవిత్ర భూమిలో జరుపుకుంటున్న రామ్ లల్లా ప్రాణ ప్రతిష్ఠ రెండవ వార్షికోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సోషల్ మీడియా పోస్ట్లో, శ్రీ మోదీ ఈ వార్షికోత్సవాన్ని విశ్వాసం మరియు సంప్రదాయం యొక్క దైవిక పండుగగా అభివర్ణించారు. దేశవ్యాప్తంగా మరియు విదేశాలలో ఉన్న రామ భక్తుల తరపున ప్రధానమంత్రి శ్రీ రాముని పాదాల వద్ద తన నమస్కారాలు మరియు ప్రణామాలు అర్పించారు.



# విర్రవీగితే సహించేది లేదు

## పాలేరులో కాంగ్రెస్ విజయభేరి బీఆర్ఎస్ నేతలకు మంత్రి పొంగులేటి హెచ్చరిక



హైదరాబాద్, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): అధికారం పోయినా కొందరు నాయకులకు అహంకారం ఇంకా తగ్గలేదని, విర్రవీగితే సహించేది లేదని రెవెన్యూ, గృహ నిర్మాణ, ఐఅండ్ పీఆర్ శాఖల మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. తమది కక్ష పూరిత ప్రభుత్వం కాదని అన్నారు. బుధవారం ఖమ్మం వైరా రోడ్డులోని ఎస్ఆర్ గార్డెన్స్ లో పాలేరు నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు ఆత్మీయ సన్మానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..గత ప్రభుత్వం కేవలం మాటలతో, ఊహలతో కాలక్షేపం చేసిందని, అనేక అవినీతి మరకలంటించుకుందని దుయ్యబట్టారు. నాయకులు ప్రజలకు దూరం కావొద్దని, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను గడపగడపకూ వివరించాలని సూచించారు. 2026 ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రజలందరి జీవితాల్లో సంతోషాలు నింపాలని ఆకాంక్షించారు.కేంద్రం సాయం లేకున్నా, రాష్ట్ర ప్రభుత్వమే రూ. 22,500 కోట్లతో ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల చొప్పున తెలంగాణ రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తుందని మంత్రి తెలిపారు. పాలేరుకు తొలి విడతలో 3,500 ఇళ్లు కేటాయించామని, గత 20 ఏళ్లలో జరగని అభివృద్ధిని ఈ రెండేళ్లలో ప్రతి గ్రామంలో కంటికి కట్టినట్లు చూపించామన్నారు. సీసీ రోడ్లు, డ్రైన్లు, బీటీ రోడ్లు, అగ్రికల్చర్ కనెక్షన్లతో గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని, దేశ చరిత్రలోనే తొలిసారి సన్న బియ్యం పంపిణీ ద్వారా పేదవాడి ప్రభుత్వంగా గుర్తింపు పొందామని వివరించారు. పాలేరు నియోజకవర్గంలోని 134 పంచాయతీల్లో సుమారు 70 శాతం కాంగ్రెస్ మద్దతుదారులు జయకేతనం ఎగురవేయడం శుభపరిణామమని మంత్రి పొంగులేటి అన్నారు. "మనలో మనకు ఉన్న చిన్నపాటి విభేదాల వల్ల కొన్ని చోట్ల ఇద్దరు ముగ్గురు పోటీ పడటంతో స్వల్ప తేడాతో సీట్లు చేజారాయి. అయినప్పటికీ, పదేళ్లు ఏలిన వారు నేడు వేళ్ల మీద లెక్కపెట్టే స్థాయికి పడిపోయారంటే ప్రజలు ఎవరి వైపు ఉన్నారో స్పష్టమైంది" అని విశ్లేషించారు. రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇదే తరహా మెరుగైన ఫలితాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ%ా% పాలేరు నియోజకవర్గ అభివృద్ధికి తన వంతుగా పూర్తి సహకారం అందిస్తానని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి హామీ ఇచ్చారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీపై ఉంచిన నమ్మకాన్ని సర్పంచులు నిలబెట్టుకోవాలని, క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాలు ప్రతి పేదవాడికి అందేలా చూడాలని కోరారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు మంత్రి పొంగులేటితో కలిసి అహర్నిశలు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు, పాలేరు నియోజకవర్గ ముఖ్య నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు భారీగా పాల్గొన్నారు.

# ఝాన్సీ రెడ్డి, ఎర్రబెల్లి మధ్య చీకటి ఒప్పందం

**పైకి ప్రత్యర్థులు.. లోపల మాత్రం మిత్రులు**

**పాలకుర్తి రాజకీయాల్లో ప్రకంపనలు**

**కాంగ్రెస్ నేత హరిప్రసాద్ సంచలన ఆరోపణలు**



వరంగల్, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): వరంగల్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గ రాజకీయాల్లో కాంగ్రెస్ సీనియర్ నేత హరిప్రసాద్ సంచలన ఆరోపణలతో పొలిటికల్ హీట్ పెంచారు. పాలకుర్తి కాంగ్రెస్ ఇన్చార్జ్ ఝాన్సీ రెడ్డి, బీఆర్ఎస్ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు లోపాయికారీ ఒప్పందంతో పనిచేస్తున్నారని, వీరిద్దరూ ఒక్కటై 'కోవర్ట్ రాజకీయాలు నడుపుతున్నారని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హరిప్రసాద్ మాట్లాడుతూ పైకి ప్రత్యర్థులుగా కనిపిస్తున్న ఝాన్సీ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు స్థానిక సంస్థల ఎన్నికల్లో మాత్రం కలిసి పనిచేశారని ఆరోపించారు. జమస్తాన్పురంలో బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థికి కాంగ్రెస్ నేత ఝాన్సీ రెడ్డి మద్దతు ఇచ్చారని, దీనికి ప్రతిఫలంగా చెర్లపాలెం, మడిపెల్లి, సోమారం గ్రామాల్లో ఝాన్సీ రెడ్డి నిలబెట్టిన అభ్యర్థులకు ఎర్రబెల్లి సపోర్ట్ చేశారని ప్రస్తావించారు. మడిపెల్లిలో ఎర్రబెల్లికి చెందిన అభ్యర్థిని ఝాన్సీ రెడ్డి డబ్బుతో కొనుక్కున్నారని, సోమారంలో అసలు ఎర్రబెల్లికి ఏజెంట్లు కూడా లేరని హరిప్రసాద్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ రెబల్స్ గెలిస్తే, వాళ్లను తానే బలపరిచానని ఎర్రబెల్లి చెప్పుకుంటున్నారని విమర్శించారు. ఒకరికి డబ్బు ఉందన్న అహంకారం, మరొకరికి ఆరుసార్లు గెలిచానన్న ధీమాతో పాలకుర్తి ప్రజలను పిచ్చోళ్లను చేసి ఆడుకుంటున్నారని మండిపడ్డారు. మీ ఇద్దరి చీకటి బంధం గురించి ప్రజలకు తెలిసిపోయిందని, ఝాన్సీ రెడ్డి, దయాకర్ రావు ఎంత ప్రయత్నించినా పాలకుర్తి ప్రజలను ఇక మోసం చేయలేరని హరిప్రసాద్ హెచ్చరించారు. మీ ఇద్దరినీ రాజకీయంగా బొందపెట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. వీరిద్దరి కోవర్ట్ బంధానికి సంబంధించిన మరిన్ని విషయాలను త్వరలోనే బయటపెడతానంటూ హరిప్రసాద్ హెచ్చరించారు. సొంత పార్టీ నేతపైనే కాంగ్రెస్ సీనియర్ లీడర్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఇప్పుడు నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది.

# న్యూ ఇయర్ సెలబ్రేషన్స్..

## ఏం తినాలి? ఏం తినకూడదు?

కొత్త సంవత్సరాన్ని గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకోవడానికి చాలా మంది ఇప్పటికే ప్లాన్లు వేసుకున్నారు. పార్టీలు, ఫ్రెండ్స్ గ్యాదరింగ్‌లు, ఫేవరెట్ ఫుడ్.. ఇవన్నీ న్యూ ఇయర్‌లో కామన్ అయిపోయాయి. చాలా మంది రాత్రిపూట మందు తాగడం, మటన్, చికెన్ లాంటి హెవీ ఫుడ్స్ తీసుకుంటారు. కానీ, ఈ సమయంలో ఏం తింటామన్నది ఆరోగ్యంపై పెద్ద ప్రభావం చూపుతుంది. కాబట్టి న్యూ ఇయర్ పార్టీని ఆనందంగా చేసుకుంటూనే ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలంటే ఈ విషయాలు గుర్తుంచుకోవాలి.





**న్యూ ఇయర్ పార్టీలో ఏం తినకూడదు?**

- అతిగా ఫ్రైడ్ ఫుడ్: చిప్స్, పకోడీలు, ఫ్రైడ్ చికెన్ ఎక్కువగా తింటే గ్యాస్, అసిడిటీ వస్తాయి.
- హెవీ నాన్-వెజ్: మటన్, ఎక్కువగా ఆయిల్‌తో చేసిన చికెన్ రాత్రివేళ జీర్ణం కావడం కష్టం.
- అతిగా కారమైన ఆహారం: కారం ఎక్కువగా ఉంటే కడుపు మంట, అజీర్ణం సమస్యలు వస్తాయి.
- తీపి పదార్థాలు: కేకులు, స్వీట్స్ ఎక్కువగా తింటే షుగర్ లెవల్స్ పెరిగే అవకాశం ఉంటుంది.
- ఆలస్యంగా ఎక్కువగా తినడం: రాత్రి చాలా ఆలస్యంగా, ఎక్కువగా తింటే నిద్రలో ఇబ్బంది కలుగుతుంది.

**న్యూ ఇయర్ పార్టీకి ఏం తినాలి?**


- లైట్ స్టార్టర్స్: సలాడ్స్, ఉడికించిన కూరగాయలు, స్ప్రౌట్స్ లాంటివి తింటే కడుపు ఇబ్బంది పడదు.
- మితంగా ప్రోటీన్ ఉన్న ఆహారం: గ్రిల్ చేసిన చికెన్, ఉడికించిన గుడ్లు, పప్పులు లాంటివి కొద్దిగా తీసుకుంటే శరీరానికి శక్తి వస్తుంది.
- పండ్లు: పార్టీ మధ్యలో లేదా తర్వాత పండ్లు తింటే జీర్ణక్రియ మెరుగ్గా ఉంటుంది.
- నేచురల్ డ్రింక్స్: నీరు ఎక్కువగా తాగాలి. నిమ్మరసం, కొబ్బరి నీళ్లు లాంటివి మంచివి.
- ఇంట్లో తయారు చేసిన ఆహారం: బయట ఆహారం కంటే ఇంట్లో చేసిన సింపుల్ ఫుడ్ ఆరోగ్యానికి మంచిది.

**ఎక్కువగా తాగడం వల్ల కలిగే సమస్యలు**

- జీర్ణ సమస్యలు: మందు, బీరు ఎక్కువగా తాగితే కడుపు మంట, అల్సర్, అసిడిటీ సమస్యలు కలుగుతాయి.
- నిద్రలో ఇబ్బంది: ఆల్కహాల్ ఎక్కువగా తీసుకోవడం వల్ల నిద్రలో ఇబ్బంది కలగడమే కాకుండా కొత్త రోజు అలసటతో మొదలవుతుంది.
- డీహైడ్రేషన్: మందు ఎక్కువగా తాగడం వల్ల శరీరం నీరు కోల్పోతుంది. శరీరానికి తేమ తగ్గి అలసట, తలనొప్పి లాంటివి వస్తాయి.
- బరువు పెరుగుదల: రాత్రి ఆలస్యంగా హెవీ ఫుడ్ తీసుకోవడం, మందు తాగడం వల్ల శరీరంలో కేలరీలు పెరుగుతాయి. ఇది బరువు పెరుగుదలకు కారణం అవుతుంది.

**సురక్షితంగా ఇలా జరుపుకోండి**

- మితంగా తాగండి.
- లైట్ ఆహారం: పార్టీ ముందు పరిమితంలో సలాడ్, సూప్, పండ్లు తినడం ఆరోగ్యానికి బాగుంటుంది.
- నియంత్రణ: మితంగా తినడం, తాగడం వలన కొత్త సంవత్సరాన్ని ఆరోగ్యంగా, హ్యాపీగా ప్రారంభించవచ్చు.
- న్యూ ఇయర్ ఆనందంగా, ఫెస్టివ్‌గా జరుపుకోవడం సంతోషకరం. కానీ అత్యధిక ఆహారం, ఎక్కువగా తాగడం ఆరోగ్యానికి హానికరం. మితంగా ఆహారం, మితంగా మందు తీసుకుంటే 2026 సంవత్సరం ఆరోగ్యంగా, ఉత్సాహంగా మొదలవుతుంది.


## కొత్త సంవత్సరం.. ఈ దేవాలయాలను సందర్శిస్తే

# అష్టైశ్వర్యాలు మీ సొంతం..!

కొత్త సంవత్సరం అందరూ ఆనందం, శాంతి, ఆరోగ్యం, శ్రేయస్సు కావాలని కోరుకుంటారు. ఆ కోరికలు నెరవేరాలని ఆశిస్తూ చాలా మంది దేవుని దర్శనంతో కొత్త సంవత్సరాన్ని ప్రారంభించాలనుకుంటారు. దేవుడిపై నమ్మకంతో సంవత్సరం మొదలుపెడితే మనసుకు ధైర్యం వస్తుంది, జీవితంలో ముందుకు వెళ్లే శక్తి పెరుగుతుంది. అందుకే ప్రతి సంవత్సరం జనవరి 1న చాలా మంది దేవాలయాలకు వెళ్లి పూజలు చేస్తారు.

ఆలయానికి వెళ్లడం వల్ల మనసుకు ప్రశాంతత లభిస్తుంది. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. జీవితంలో మంచి మార్పులు రావాలనే ఆశ బలపడుతుంది. 2026 సంవత్సరం ఆనందంగా, శ్రేయస్సుతో ఉండాలని కోరుకునేవారు కొత్త సంవత్సరం రోజున ప్రసిద్ధి చెందిన దేవాలయాలను సందర్శించవచ్చు. ఇలా దేవుని ఆశీస్సులతో సంవత్సరాన్ని ప్రారంభించడం ఒక మంచి అలవాటు, మంచి ఆరంభం అని చాలా మంది నమ్ముతారు.

**అయోధ్యలోని రామాలయం**

అయోధ్యలోని రామాలయం చాలా పవిత్రమైనది. ఇది శ్రీరాముడు జన్మించిన భూమిగా భావిస్తారు. రామ్ లల్లా ప్రతిష్ట అయిన తర్వాత భక్తుల సంఖ్య మరింత పెరిగింది. జనవరి 1న రామ్ లల్లా దర్శనం చేస్తే మనసు భక్తితో, సానుకూల ఆలోచనలతో నిండిపోతుంది. కొత్త సంవత్సరం ప్రారంభంలో శ్రీరాముడిని దర్శించుకుంటే జీవితంలో గౌరవం, శాంతి, విజయం లభిస్తాయని నమ్ముతారు.

**సిద్ధి వినాయక ఆలయం**

ఏ కొత్త పని ప్రారంభించాలన్నా ముందుగా గణేశుడిని పూజించడం మంచి సంప్రదాయం. ముంబైలోని సిద్ధి వినాయక ఆలయం దేశంలోనే అత్యంత ప్రసిద్ధ గణేశ ఆలయాల్లో ఒకటి. జనవరి 1న ఇక్కడకు పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారు. గణేశుడు జీవితంలోని అడ్డంకులను తొలగిస్తాడని నమ్మకం. కొత్త సంవత్సరం మొదటి రోజున గణేశ దర్శనం చేస్తే సమస్యలు తగ్గి సరైన దారి దొరుకుతుందని విశ్వసిస్తారు. 2026లో అడ్డంకులు లేకుండా జీవితం సాగాలంటే సిద్ధి వినాయక ఆలయాన్ని సందర్శించవచ్చు.

**కాశీ విశ్వనాథ ఆలయం**

వారణాసిలోని కాశీ విశ్వనాథ ఆలయం శివుడికి అంకితం చేయబడింది. ఇది 12 జ్యోతిర్లింగాల్లో ఒకటి. ఈ ఆలయం గంగానది ఒడ్డున ఉంటుంది. జనవరి 1న గంగానదిలో స్నానం చేసి శివుని దర్శించుకోవడం చాలా శుభప్రదమని అంటారు. శివుడి ఆశీస్సులతో పాపాలు తొలగి, కొత్త శక్తి లభిస్తుందని నమ్మకం. మనశ్శాంతి, ఆధ్యాత్మిక బలం కావాలనుకునే వారు కాశీని సందర్శించవచ్చు.

**షిర్డీ సాయిబాబా ఆలయం**

మహారాష్ట్రలోని షిర్డీ సాయిబాబా ఆలయం చాలా ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం. ఇక్కడ సాయిబాబా సమాధి ఉంది. ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు ఇక్కడికి వస్తారు. సాయిబాబా ప్రేమ, నమ్మకం, సమానత్వానికి ప్రతీకగా భావిస్తారు. కొత్త సంవత్సరాన్ని సాయిబాబా దర్శనంతో ప్రారంభిస్తే జీవితంలో శాంతి, సమతుల్యత వస్తుందని నమ్మకం. 2026ను ప్రశాంతంగా, సానుకూలంగా గడపాలనుకునే వారు షిర్డీని సందర్శించవచ్చు.

**ఉజ్జయిని మహంకాళి దేవాలయం**

మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో మహంకాళి ఆలయం ఉంది. ఇది దక్షిణం వైపు ఉన్న ఏకైక జ్యోతిర్లింగం. ఇక్కడి భస్మ ఆరతి చాలా ప్రసిద్ధి చెందింది. మహాకాలుడిని దర్శిస్తే కాలభయం, మరణభయం తొలగిపోతాయని నమ్మకం ఉంది. 2026లో స్థిరత్వం, ఆత్మవిశ్వాసం, శ్రేయస్సు కోరుకునే వారు ఉజ్జయిని మహాకాల ఆలయాన్ని సందర్శించవచ్చు.

# హ్యాంగోవర్ నుంచి ఇలా బయటపడండి..



నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు యావత్ ప్రపంచం సిద్ధమైంది. డిసెంబర్ 31 అర్ధరాత్రి ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఒక్కరూ బిగ్ సెలబ్రేషన్స్ చేసుకుంటారు. న్యూఇయర్ సెలబ్రేషన్స్ కోసం ఇప్పటికే ఎవరి ప్లాన్స్ వారు చేసుకుంటారు. ఇక న్యూఇయర్ పార్టీలో మందు, చిందు అనేది కామన్. యువత మద్యం మత్తులో ఊగిపోతుంటారు. ఆ రోజు రాత్రంతా ఫుల్లుగా తాగేస్తారు. ఫుల్ మస్తీ చేస్తారు. తాగుడు, చిందేసుడు వరకు బాగానే ఉంటుంది. కానీ, ఆ మరుసటి రోజే సినిమా కనిపిస్తుంది. చాలా మంది హ్యాంగోవర్ సమస్యతో బాధపడుతుంటారు. మరి హ్యాంగోవర్ సమస్య నుంచి ఎలా బయటపడాలి? అంటే ఇందుకోసం అద్భుతమైన చిట్కాలు తీసుకువచ్చాం. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.. ఈ చిట్కాలతో కేవలం 10 నిమిషాల్లో హ్యాంగోవర్ సమస్య నుంచి బయటపడొచ్చు.

## పసుపు నీళ్లు:

పసుపు నీళ్లు హ్యాంగోవర్ నుంచి బయట పడేందుకు సహాయపడుతుంది. ఇందులో నొప్పి, వాపు, ఇన్‌ఫెక్షన్ వంటి లక్షణాలను తగ్గించే శక్తి ఉంటుంది. హ్యాంగోవర్ లక్షణాలను తగ్గించడంలో ఇది సహాయపడుతుంది. హ్యాంగోవర్ సమస్యతో బాధపడేవారు 1 టీస్పూన్ పసుపును, ఒక నిమ్మ చెక్క రసాన్ని గోరువెచ్చని నీటిలో కలిపి తాగాలి. ఇందులో కొద్దిగా నల్లమిరియాలు, తేనె కూడా కలపవచ్చు.

## కొబ్బరినీళ్లు:

కొబ్బరి నీళ్లు కూడా హ్యాంగోవర్ సమస్యను తగ్గిస్తుంది. ఎక్కువగా ఆల్కహాల్ తీసుకోవడం శరీరం డీహైడ్రేడ్ అవుతుంది. కొబ్బరినీళ్లు తీసుకోవడం వల్ల ఇందులోని ఎలక్ట్రోలైట్లు శరీరానికి తక్షణ శక్తిని ఇస్తాయి. తద్వారా డీహైడ్రేషన్ సమస్య తగ్గి.. హ్యాంగోవర్ సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది.

## నిమ్మకాయ నీరు:

హ్యాంగోవర్ సమస్యకు నిమ్మకాయ నీరు కూడా అత్యంత ప్రభావవంతంగా పని చేస్తుంది. ఒక గ్లాసు నిమ్మరసం, చిటికెడు ఉప్పు కలిపి తాగాలి. శరీరంలో ఎలక్ట్రోలైట్లను పెంచుతుంది. తద్వారా శరీరం హైడ్రేట్‌గా మారి.. హ్యాంగోవర్ సమస్య నుంచి ఉపశమనం పొందుతుంది. వికారం, వాంతులు, తలనొప్పి సమస్య నుంచి ఉపశమనం పొందుతుంది.

## పెరుగు:

పెరుగు, మజ్జిగ తాగడం వల్ల కూడా హ్యాంగోవర్ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు. చక్కెర గానీ, ఉప్పు గానీ కలపకుండా సాదా మజ్జిగ, పెరుగు తీసుకోవాలి.

## అరటిపండ్లు:

హ్యాంగోవర్ సమస్య నుంచి ఉపశమనం పొందడంలో అరటిపండ్లు చాలా ప్రభావవంతంగా పని చేస్తాయి. వీటిలో ఉండే పొటాషియం, కార్బోహైడ్రేట్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి డీహైడ్రేషన్ సమస్యను తగ్గిస్తాయి.

## పుదీనా నీరు:

పుదీనా కూడా హ్యాంగోవర్ నుంచి ఉపశమనం కల్పించడంలో అద్భుతంగా పని చేస్తుంది. తాజా పుదీనా ఆకులను వేడి నీటిలో కాసేపు మరిగించాలి. ఆ తరువాత వడకట్టి తాగాలి. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా వికారం, వాంతుల నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

## గ్రీన్ టీ:

గ్రీన్ టీలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. శరీరానికి త్వరిత శక్తిని అందిస్తుంది. హ్యాంగోవర్ నుంచి బయటపడటానికి సహాయపడుతుంది.

## వెజిటేబుల్, చికెన్ సూప్:

హ్యాంగోవర్ సమయంలో శరీరంలో ఎలక్ట్రోలైట్స్ తగ్గిపోతాయి. ఈ సమస్య నుంచి బయటపడేందుకు తేలికపాటి వెజిటేబుల్ సూప్, చికెన్ సూప్ తీసుకోవాలి. ఇది శరీరానికి అవసరమైన ఖనిజాలను అందిస్తుంది. ఇది సులభంగా జీర్ణమవుతుంది. వెచ్చని సూప్ శరీరానికి శక్తిని ఇస్తుంది.

# 2026లో భారత జట్టు చాలా బిజీ షెడ్యూల్



భారత పురుషుల క్రికెట్ జట్టు షెడ్యూల్ 2026లో చాలా బిజీగా ఉండబోతోంది. వచ్చే ఏడాది క్యాలెండర్‌లో ప్రతిష్టాత్మక టోర్నీలు ఆడనున్న టీమ్‌ఇండియాకు కీలకం కానుంది. ఒకవైపు, భారత్ ఆతిథ్యమిచ్చే టీ20 ప్రపంచకప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగనుంది. మరోవైపు, ఈ ఏడాది టెస్ట్ క్రికెట్‌లో కోల్పోయిన ప్రాభవాన్ని తిరిగి సంపాదించుకోవడం ఇప్పుడు భారత జట్టు ముందున్న అతిపెద్ద సవాల్ మారింది. ముఖ్యంగా సొంతగడ్డపై దక్షిణాఫ్రికా చేతిలో ఎదురైన పరాజయం భారత టెస్ట్ చరిత్రలోనే ఘోరమైన ఓటమిగా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో 2026లో జరిగే టెస్ట్ సిరీస్‌లు భారత జట్టుకు పరీక్షగా మారనున్నాయి. అఫ్గానిస్థాన్, శ్రీలంక, న్యూజిలాండ్ పర్యటనల్లో టెస్టులు ఆడనుంది. ఈ క్రమంలో భారత్ తిరిగి ప్రపంచ టెస్ట్ క్రికెట్‌లో తన స్థానం నిలబెట్టుకోగలదా? వైట్‌బాల్ క్రికెట్‌లో 2025లో భారత్ ఆధిపత్యం చలాయించింది. చాంపియన్స్ ట్రోఫీ విజయంతో పాటు, టీ20లో నెంబర్ 1 జట్టుగా భారత్ నిలిచింది. నూతన సంవత్సర ఆరంభంలోనే న్యూజిలాండ్‌తో భారత్ వన్డేలు, టీ20 సిరీస్‌లను ఆడనుంది. ఈ పర్యటనలో మొత్తం 3 వన్డేలు, 5 టీ20లు జరుగుతాయి. భారత్, శ్రీలంక సంయుక్త ఆతిథ్యమిస్తున్న టీ20 ప్రపంచకప్ ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు జరుగుతుంది. గ్రూప్-ఏలో ఉన్న భారత్ తన లీగ్ మ్యాచ్‌లను కింది తేదీల్లో ఆడనుంది. వచ్చే ఏడాది టీమ్ ఇండియా దాదాపు 5 టెస్టులు, 18 వన్డేలు, 20 పైగా టీ20లు (ఆసియా క్రీడలు, వరల్డ్ కప్‌తో కలిపి) ఆడనుంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ జనవరి 11 నుంచి న్యూజిలాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌లో ఆడనున్నారు. వీరిద్దరు టీ20, టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించినందున వన్డేల్లోనే ఆడతారు. కాబట్టి 2026లో ఈ ఇద్దరు లెజెండ్స్ 12 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో మైదానంలో అడుగుపెట్టనున్నారు. అయితే 2026లో జరగనున్న టీ20 ప్రపంచకప్‌కు రోహిత్ శర్మ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించనున్నారు. 2026వ సంవత్సరంలో భారత మహిళల క్రికెట్ జట్టు ఫుల్ బిజీగా ఉండనుంది. భారత మహిళల జట్టు ఫిబ్రవరిలో ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. ఈ పర్యటనలో అన్ని ఫార్మాట్లలో మ్యాచ్‌లు జరుగుతాయి. టీ20 ప్రపంచకప్ ముగిసిన వెంటనే, భారత్, ఇంగ్లాండ్ మహిళల జట్ల మధ్య లార్డ్స్ మైదానంలో తొలిసారిగా ఒక టెస్ట్ మ్యాచ్ జరగనుంది. జూలై 10న ఈ మ్యాచ్ ప్రారంభమవుతుంది. సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 జపాన్‌లోని ఐచి-నాగోయాలో జరిగే 20వ ఆసియా క్రీడల్లో భారత మహిళల క్రికెట్ జట్టు పాల్గొంటుంది. గత ఎడిషన్‌లో గెలిచిన స్వర పతకాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా టీమ్‌ఇండియా బరిలోకి దిగుతుంది.




## సూర్యకుమార్ ఫ్రెండ్లీగానే మెసేజ్‌లు చేసేవాడు

### స్పష్టం చేసిన బాలీవుడ్ నటి ఖుషీ ముఖర్జీ


టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌తో తనకు ఎలాంటి సంబంధాలు లేవని, ఫ్రెండ్లీగానే మెసేజ్‌లు చేసేవాడని బాలీవుడ్ నటి ఖుషీ ముఖర్జీ స్పష్టం చేసింది. ఓ ఇంటర్వ్యూలో సూర్య తనకు తరుచూ మెసేజ్‌లు చేసేవాడని ఆమె చెప్పిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఈ వ్యాఖ్యలను తప్పుడుగా అర్థం చేసుకున్న కొందరు నెటిజన్లు.. సూర్య మామూలోడు కాదంటూ కామెంట్ చేశారు. మరికొందరు మాత్రం పబ్లిసిటీ స్టంట్ అంటూ ఖుషీ ముఖర్జీపై విమర్శలు గుప్పించారు. దాంతో తన వ్యాఖ్యలపై ఖుషి ముఖర్జి వివరణ ఇచ్చుకుంది. 'మా మధ్య ఏమీ లేదు. మేం జస్ట్ స్నేహితులం మాత్రమే. ఆ సమయంలో తాను ఒక మ్యాచ్‌లో ఓటమి పాలయ్యాడు. అతని ఓటమి నన్ను ఎంతో బాధించింది. అప్పుడే మెసేజ్‌లు చేసుకున్నాం. అంతకుమించి మా మధ్య ఏం లేదు. అతను నాకు మంచి స్నేహితుడు మాత్రమే.'అని ఖుషి ముఖర్జి స్పష్టం చేసింది. ఓ ఇంటర్వ్యూలో ఏ క్రికెటర్‌తోనైనా డేటింగ్ చేయాలనుకుంటున్నారా? అని ఒక మీడియా ఈవెంట్‌లో ఖుషీ ముఖర్జీకి ప్రశ్న ఎదురైంది. 'చాలా మంది క్రికెటర్లు నా వెంటపడ్డారు. అందులో సూర్యకుమార్ యాదవ్ కూడా ఒకరు. నేను ఏ క్రికెటర్‌తో డేటింగ్ చేయాలని అనుకోవడం లేదు. అయితే సూర్యకుమార్ యాదవ్ గతంలో నాకు తరచూ మెసేజ్‌లు చేసేవాడు. ఇప్పుడు మేం కాంటాక్ట్‌లో లేము. నన్ను ఎవరితోనూ లింక్ చేసి మాట్లాడటం నాకు నచ్చదు.'అని ఖుషీ ముఖర్జి మాట్లాడిన మాటలు వైరల్ అయ్యాయి. కోల్‌కతాకు చెందిన ఖుషీ ముఖర్జీ దక్షిణాది సినిమాలతో పాటు హిందీ బుల్లితెరపై కూడా సుపరిచితురాలే. 2013లో 'అంజల్ తురై' అనే తమిళ చిత్రంతో కెరీర్ ప్రారంభించారు. తెలుగులో 'దొంగ ప్రేమ', 'హార్ట్ ఎటాక్' వంటి చిత్రాల్లో నటించారు. ఎం టీవీ 'స్ప్లిట్స్‌విల్లా 10', 'లవ్ స్కూల్ 3' వంటి షోల ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.'బాల్వీర్ రిటర్న్స్'లో జ్వాలా పరిగా, 'కహత్ హనుమాన్ జై శ్రీరామ్' వంటి పౌరాణిక సీరియల్స్‌లోనూ నటించారు. ఖుషీ ముఖర్జీ తరచుగా తన బోల్డ్ ఫ్యాషన్, వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలుస్తుంటారు. అయితే ఈ వ్యాఖ్యలపై సూర్యకుమార్ యాదవ్ వైపు నుంచి ఇప్పటివరకు ఎలాంటి స్పందన రాలేదు.

## మహమ్మద్ షమీ రీఎంట్రీ ఇచ్చేనా..!



టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ షమీ రీఎంట్రీ ఇవ్వనున్నాడా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. న్యూజిలాండ్‌తో జనవరి 11 నుంచి ప్రారంభం కానున్న మూడు వన్డేల సిరీస్‌లో షమీ బరిలోకి దిగుతాడని ప్రచారం జరుగుతోంది. దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా ఆడుతున్న మహమ్మద్ షమీ పునరాగమనం కోసం తీవ్రంగా కష్టపడుతున్నాడు. అతని దేశవాళీ ప్రదర్శనతను బీసీసీఐ నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. సీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో చివరిసారిగా భారత్ జట్టు తరఫున ఆడిన షమీ.. మళ్లీ అవకాశం అందుకోలేకపోయాడు. ఛాంపియన్స్ ట్రోఫీ అనంతరం గాయంతో అతను జట్టుకు దూరమయ్యాడు. ఆ తర్వాత ఫిట్‌నెస్ సాధించి దేశవాళీ క్రికెట్‌లో మెరుగైన ప్రదర్శన చేసినా.. కుర్రాళ్లకు అవకాశం ఇవ్వాలనే యోచనతో సెలెక్టర్లు షమీని పట్టించుకోలేదు. భారత సెలెక్టర్ల తీరుపై షమీ కూడా అసహనం వ్యక్తం చేశాడు. తనకు సెలెక్టర్ల నుంచి ఎలాంటి సమాచారం లేదని చెప్పాడు. రిటైర్మెంట్ అంటూ వచ్చిన వార్తలను కూడా ఖండించాడు. విజయ్ హజారే ట్రోఫీ షమీ అదుతే ప్రదర్శన కనబరుస్తున్నాడు. బెంగాల్ తరఫున మూడు మ్యాచ్‌లు ఆడిన షమీ 6 వికెట్లు పడగొట్టాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఏడు మ్యాచ్‌ల్లో 16 వికెట్లు తీసాడు. న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌తో పాటు టీ20 ప్రపంచకప్ 2026 బరిలోకి దిగే భారత జట్టులో షమీకి చోటు దక్కలేదు. అయితే న్యూజిలాండ్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్ కోసం సెలెక్టర్లు ఇంకా భారత జట్టును ప్రకటించలేదు. మరో రెండు రోజుల్లో ఈ జట్టును ప్రకటించనున్నారు. టీ20 ప్రపంచకప్ 2026 నేపథ్యంలో బుమ్రాకు వన్డే సిరీస్ నుంచి విశ్రాంతి ఇవ్వనున్నారు. ఈ క్రమంలోనే షమీని వన్డే టీమ్‌లోకి తీసుకోవాలనే ఆలోచనలో సెలెక్టర్లు ఉన్నట్లు తెలుస్తోంది. 'మహమ్మద్ షమీ ఎంపిక గురించి చర్చ జరుగుతుంది. అతని నైపుణ్యంపై ఎలాంటి సందేహం లేదు. కానీ అతని ఫిట్‌నెస్ గురించే ఆందోళన. న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు అతను ఎంపిక కావచ్చు. అలాగే వన్డే ప్రపంచకప్ 2027లో కూడా అతను ఆడే అవకాశాన్ని కొట్టిపారేయలేం.'అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. వన్డే ప్రపంచకప్ 2023లో షమీ అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. ఆస్ట్రేలియాతో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2023 ఫైనల్ తర్వాత అతను ఒక్క టెస్ట్ మ్యాచ్ ఆడలేదు. ఫిట్‌నెస్ సమస్యల నేపథ్యంలో సెలెక్టర్లు పట్టించుకోలేదు. టీ20ల్లో ఈ ఏడాది ఫిబ్రవరి ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో చివరిసారిగా బరిలోకి దిగాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ తరహాలో వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగి వరల్డ్ కప్ ఆడాలని షమీ ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

## క్రిస్ లిన్ సిక్సర్ల కింగ్ విధ్వంసం..



ఆస్ట్రేలియా విధ్వంసక బ్యాటర్ క్రిస్ లిన్ బిగ్ బాష్ లీగ్‌లో తన ప్రతాపాన్ని మరోసారి చూపించాడు. 2025 సంవత్సరం ముగింపు వేళ ఆస్ట్రేలియా గడ్డపై సిక్సర్ల సునామీ స ృష్టించి అభిమానులకు అదిరిపోయే విందును అందించాడు. బ్రిస్బేన్ హీట్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో అడిలైడ్ స్ట్రైకర్స్ తరఫున బరిలోకి దిగిన లిన్.. ప్రత్యర్థి బౌలర్లను ఊచకోత కోస్తూ తన జట్టుకు భారీ విజయాన్ని అందించాడు. కేవలం మ్యాచ్ గెలవడమే కాదు, ఈ క్రమంలో ఎవరికీ సాధ్యం కాని ఒక అరుదైన రికార్డును కూడా తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో అడిలైడ్ స్ట్రైకర్స్ కెప్టెన్ మాథ్యూ షార్ట్ పరుగులు చేయడానికి తడబడగా, క్రిస్ లిన్ మాత్రం క్రీజులోకి వచ్చిన క్షణం నుంచే బంతిని బౌండరీల అవతలికి పంపడం మొదలుపెట్టాడు. కేవలం 41 బంతుల్లో 79 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఇందులో 6 సిక్సర్లు, 6 ఫోర్లు ఉన్నాయి. 190కి పైగా స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసిన లిన్ ధాటికి, 122 పరుగుల లక్ష్యాన్ని అడిలైడ్ జట్టు మరో 35 బంతులు మిగిలి ఉండగానే అలవోకగా ఛేదించింది. నాలుగో ఓవర్లో మిడ్ వికెట్ మీదుగా లిన్ బాదిన సిక్సర్ స్టేడియంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ మెరుపు ఇన్నింగ్స్ ద్వారా క్రిస్ లిన్ బిగ్ బాష్ లీగ్‌లో 4000 పరుగుల మైలురాయిని చేరుకున్న తొలి ఆటగాడిగా చరిత్ర స ృష్టించాడు. ఇప్పటివరకు 131 మ్యాచ్‌ల్లో 4065 పరుగులు చేసిన లిన్, ఈ లీగ్‌లో తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నాడు. ఇందులో ఒక సెంచరీ, 32 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. మరీ ముఖ్యంగా, బీబీఎల్ చరిత్రలో 200 కంటే ఎక్కువ సిక్సర్లు (226) కొట్టిన ఏకైక ఆటగాడు కూడా ఇతనే. 151 సిక్సర్లతో గ్లెన్ మాక్స్‌వెల్ రెండో స్థానంలో ఉన్నాడంటే, లిన్ రేంజ్ ఏంటో అర్థం చేసుకోవచ్చు. లిన్ గతంలో ఐపీఎల్‌లో కూడా 42 మ్యాచ్‌ల్లో 1329 పరుగులు చేసి సత్తా చాటాడు. లీగ్ క్రికెట్‌లో ఇంతటి ఘనమైన రికార్డు ఉన్నప్పటికీ, క్రిస్ లిన్ అంతర్జాతీయ క్రికెట్‌లో మాత్రం ఆ స్థాయిలో రాణించలేకపోయాడు. ఆస్ట్రేలియా తరఫున 18 టీ20లు ఆడి కేవలం 291 పరుగులు మాత్రమే చేశాడు. ఇందులో ఒక్క హాఫ్ సెంచరీ కూడా లేకపోవడం గమనార్హం. అలాగే 4 వన్డేల్లో 75 పరుగులు చేశాడు. గాయాలు, నిలకడలేమి కారణంగా జాతీయ జట్టులో ఎక్కువ కాలం ఉండలేకపోయినప్పటికీ, టీ20 ఫ్రాంచైజీ లీగ్స్‌లో మాత్రం లిన్ ఇప్పటికీ మోస్ట్ వాంటెడ్ బ్యాటర్ గానే కొనసాగుతున్నాడు.



## రుతురాజ్ గైక్వాడ్ విధ్వంసం..

విజయ్ హజారే ట్రోఫీలో మహారాష్ట్ర కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ తన ఫామ్‌ను కొనసాగిస్తూ మరో అదుతేమైన సెంచరీతో చెలరేగిపోయాడు. ఉత్తరాఖండ్‌తో జరిగిన మ్యాచ్‌లో విపత్కర పరిస్థితుల్లో బ్యాటింగ్‌కు వచ్చిన రుతురాజ్, బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించాడు. కేవలం మ్యాచ్ గెలవడమే కాదు, ఈ సెంచరీతో టీమిండియా మిడిల్ ఆర్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ స్థానానికి గట్టి పోటీని ఇస్తూ సెలెక్టర్లకు స్పష్టమైన సంకేతాలు పంపాడు. జైపూర్‌లో జరిగిన ఈ పోరులో మహారాష్ట్ర జట్టుకు ఆరంభంలోనే భారీ షాక్ తగిలింది. కేవలం 50 పరుగులకే మూడు కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. 113 బంతుల్లో 124 పరుగులు చేసి జట్టు స్కోరును 331 పరుగులకు చేర్చాడు. అతని ఇన్నింగ్స్‌లో 12 ఫోర్లు, 3 సిక్సర్లు ఉన్నాయి. గైక్వాడ్ తో పాటు సత్యజీత్ బచ్చవ్ (56), రామక ృష ఘోష్ (47) కూడా రాణించడంతో మహారాష్ట్ర భారీ స్కోరు సాధించింది. 332 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఉత్తరాఖండ్ ఏ దశలోనూ మహారాష్ట్ర బౌలర్లకు పోటీ ఇవ్వలేకపోయింది. సౌరభ్ రావత్ (56) మినహా మిగిలిన బ్యాటర్లంతా విఫలమవడంతో ఆ జట్టు 202 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఫలితంగా మహారాష్ట్ర 129 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. బౌలింగ్‌లో రాజ్‌వర్ధన్ హంగర్గేకర్, సత్యజీత్ బచ్చవ్ తలో మూడు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. ఈ సెంచరీ ఇప్పుడు టీమిండియాలో చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా రుతురాజ్ ఓపెనర్ అయినప్పటికీ, ఈ మ్యాచ్‌లో నాలుగో స్థానంలో వచ్చి సెంచరీ బాదాడు. భారత వన్డే జట్టులో నంబర్-4 స్థానంలో శ్రేయస్ అయ్యర్ ఆడుతుంటాడు. ప్రస్తుతం అయ్యర్ గాయంతో జట్టుకు దూరంగా ఉండటంతో, అతని స్థానంలో గైక్వాడ్ పాగా వేసేలా కనిపిస్తున్నాడు. ఇటీవలే సౌతాఫ్రికాపై తన తొలి అంతర్జాతీయ వన్డే సెంచరీని నమోదు చేసిన రుతురాజ్, ఇప్పుడు న్యూజిలాండ్‌తో జరగబోయే వన్డే సిరీస్‌కు ముందు మళ్ళీ సెంచరీతో మెరవడం విశేషం. గైక్వాడ్ ఇలాగే రాణిస్తే అయ్యర్ తిరిగి జట్టులోకి రావడం కష్టమేనని విశ్లేషకులు భావిస్తున్నారు.

## పాకిస్తాన్ క్రికెటర్లకు చేదు అనుభవం..

2007లో జరిగిన తొలి టీ20 వరల్డ్ కప్ ఫైనల్లో భారత్ చేతిలో పాకిస్తాన్ ఓడిపోయింది. 2 ఏళ్ల తర్వాత పాక్ జట్టు ఎలాగైనా కప్ కొట్టాలని మరోసారి ఫైనల్ చేరింది. పాకిస్థాన్ జట్టు 2009 టీ20 వరల్డ్ కప్ ఫైనల్లో శ్రీలంకను 8 వికెట్ల తేడాతో ఓడించి చరిత్ర స ృష్టించింది. పాకిస్థాన్ తొలిసారి టీ2 ఛాంపియన్‌గా నిలిచింది. పొట్టి ప్రపంచ కప్ నెగ్గిన రెండో జట్టుగా నిలిచింది. అయితే, ఆ తర్వాత పొట్టి ప్రపంచ విజేత జట్టు మోసపోయిందనే విషయం మీకు తెలుసా.. తమకు జరిగిన మోసం గురించి పాక్ మాజీ క్రికెటర్ సయీద్ అజ్మల్ తాజాగా వెల్లడించారు. సయీద్ అజ్మల్ఒ క మీడియా సమావేశంలో మాట్లాడుతూ, 2009 వరల్డ్ కప్ గెలిచిన తర్వాత పాకిస్థాన్ అప్పటి ప్రధాని విజేత పాకిస్తాన్ జట్టులోని ప్రతి ఆటగాడికి 25 లక్షల రూపాయల చెక్కులు ఇచ్చారట. కానీ ఆ చెక్కులు బౌన్స్ అవ్వడంతో పాక్ ప్లేయర్లు ఎవరికీ ఒక్క రూపాయి కూడా దక్కలేదని సంచలన విషయాన్ని వెల్లడించాడు. ఒక పాకిస్థానీ యూట్యూబ్ ఛానెల్‌లో అతిథిగా పాల్గొన్న సయీద్ అజ్మల్ పొట్టి ప్రపంచ కప్ విజేతగా నిలిచాక తమకు ఎదురైన చేదు అనుభవాన్ని వివరించాడు. "మేము 2009 టీ20 వరల్డ్ కప్ గెలిచి పాక్ తిరిగి వచ్చినప్పుడు, మాకు డబ్బు రాలేదు. ఎందుకంటే మేము ఆ తర్వాత శ్రీలంకలో పర్యటించాం. పాకిస్థాన్ అప్పటి ప్రధాని మమ్మల్ని ఆహ్వానించి, ప్రతి ఆటగాడికి 25 లక్షల రూపాయల చెక్కులు ఇచ్చారు. ఆ రోజుల్లో అది చాలా పెద్ద మొత్తం అని అంతా సంతోషించాము. కానీ ఆ చెక్కులు బౌన్స్ అయ్యాయి" అని అజ్మల్ తెలిపాడు. పాకిస్తాన్ ప్రభుత్వం ఇచ్చిన చెక్కులు కూడా బౌన్స్ అవుతాయని అజ్మల్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ చూసుకుంటారని ఆటగాళ్లకు చెప్పారు. కానీ ఈ బాధ్యతను ప్రధానియే చూసుకుంటారని ఛైర్మన్ చేతులు దులుపుకున్నారని అజ్మల్ వెల్లడించాడు. పాకిస్థాన్ క్రికెటర్లకు ఐసిసి నుండి వచ్చిన డబ్బు మాత్రమే దక్కిందని తెలిపాడు. 2009 తర్వాత పాకిస్థాన్ మళ్లీ T20 వరల్డ్ కప్ టైటిల్ గెలవలేదు. ముఖ్యంగా పాకిస్తాన్ లో శ్రీలంక క్రికెటర్లపై దాడి ఘటన తరువాత దశాబ్దానికి పైగా ఆ దేశంలో ఏ జట్టు పర్యటించలేదు. దాంతో పాక్ క్రికెట్ పూర్వ వైభవం కోల్పోయింది. అయితే, 2022లో ఫైనల్ చేరుకుంది. 2022 ఫైనల్లో ఇంగ్లాండ్ చేతిలో పాక్ 5 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది.

# టాక్సిస్ మూవీలో గంగగా నయనతార

యశ్ హీరోగా మలయాళ దర్శకురాలు గీతూమోహన్ దాస్ 'టాక్సిక్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. 'ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' అనేది ట్యాగ్ లైన్. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ సినిమాలో నయనతార లుక్‌ను టీమ్ రిలీజ్ చేసింది. ఇందులో ఆమె గంగ అనే పాత్రలో కనిపించనున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను పంచుకున్నారు. మోడ్రన్ డ్రెస్‌లో గన్ పట్టుకొని పవర్‌ఫుల్ లుక్స్‌తో నయన్ కనిపించారు. ఈ చిత్రంలో ముగ్గురు హీరోయిన్‌లు ఉన్నట్లు మొదటినుంచి వార్తలు వస్తున్నాయి. వాటిని నిజం చేస్తూ చిత్రబృందం ముగ్గురు హీరోయిన్ల లుక్‌లను వరుసగా విడుదల చేసింది. కియారా ఆడ్వాణీ నదియా పాత్రలో కనిపించనుండగా హ్యుమా ఖురేషీ ఎలిజబెత్ పాత్రలో అలరించనున్నారు. చిన్నారుల కోసం ఎన్నో కథలు తెరకెక్కాయని, ఇది పెద్దలకు సందేశమిచ్చే చిత్రమని యశ్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఆయన 19వ చిత్రంగా 'టాక్సిక్' తెరకెక్కుతోంది. వచ్చే ఏడాది మార్చి 19న ప్రేక్షకుల ముందుకురానుంది. 'కేజీయఫ్' తర్వాత యశ్ నటిస్తున్న సినిమా కావడంతో దీనిపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.



# హారర్ ఫాంటసీ కామెడీ సినిమా రాలేదు

## రాజాసాబ్ మొదటి సినిమా అన్న మారుతి

ఇప్పటివరకూ ఇండియన్ స్క్రీన్ మీద హారర్ ఫాంటసీ కామెడీ సినిమా రాలేదని రాజాసాబ్ డైఎక్టర్ మారుతి అన్నారు. రాజాసాబ్ మొదటి చిత్రం అవుతుంది. కథ రాయడానికి సంవత్సరం పట్టింది. ఏడాదిన్నర పాటు మేకింగ్.. పోస్ట్‌ప్రొడక్షన్‌కు కూడా 7 నెలలు పట్టింది. మొత్తం సినిమా నాలుగు గంటలకు పైగా వచ్చిందని మారుతి తెలిపారు. ది రాజాసాబ్' కథను చెప్పడానికి ప్రభాస్ దగ్గరకు వెళ్లినప్పుడు ఆయన 'ఆదిపురుష్' సెట్‌లో రాముడి గెటప్‌లో ఉన్నారు. వినోదాత్మక కథ ఉంటే చెప్పమన్నారు. హారర్ కామెడీ కథ ఉందని చెప్పా. ఆయన వెంటనే ఓకే అన్నారు. ఆయన ఓకే చెప్పిన తర్వాత నేను స్టోరీలో మార్పులు చేసి ఫాంటసీ ఎలిమెంట్స్ యాడ్ చేశానన్నారు. ఇటీవల జరిగిన 'ది రాజాసాబ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో దర్శకుడు మారుతి భావోద్వేగానికి గురైన విషయం తెలిసిందే. ప్రభాస్ గురించి చెబుతూ.. 'మీరు ఎదురుగా ఉంటే నా వల్ల కాదు..' అంటూ ఆయన భావోద్వేగంతో కన్నీరు పెట్టుకున్నారు. వెంటనే ప్రభాస్ వేదిక పైకి వచ్చి మారుతిని ఓదార్చారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల వేదికగా వైరలైంది. తాజాగా మారుతి ఓ ఇంటర్వ్యూలో దాని గురించి మాట్లాడారు. నేను ఆ సమయంలో ప్రభాస్ వేదిక పైకి వస్తారని అనుకోలేదు. నేను ఎమోషనల్ కాగానే ఆయన స్టేజ్ పైకి వచ్చి వెనకనుంచి హగ్ చేసుకున్నారు. వెంటనే 'సారీ డార్లింగ్' అని చెప్పా. 'ఫర్వాలేదు. ఈ కన్నీరు హృదయంలో నుంచి వచ్చేవి. నువ్వు ఎమోషనల్ అవుతావని ముందే ఊహించాను. నేను స్టేజ్ పైకి ఆలస్యంగా వచ్చాను. ముందే రావాల్సింది' అని ప్రభాస్ అన్నారు. ఎంత కంట్రోల్ చేసుకున్నా ఎమోషన్ ఆగలేదని మారుతి తెలిపారు.



# నువ్వు నాకు నచ్చావ్.. నేడు రీరిలీజ్

'కొన్ని సినిమాలు డబ్బులు... మరికొన్ని సినిమాలు పేరునీ తీసుకొస్తాయి. గౌరవం మాత్రం చాలా కొన్ని సినిమాలే తీసుకొస్తాయి. 'నువ్వు నాకు నచ్చావ్' అలాంటి ఓ ప్రత్యేకమైన గౌరవాన్ని తీసుకొచ్చిన సినిమా అన్నారు ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్. ఆయన రచయితగా, విజయ్ భాస్కర్.కె దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. వెంకటేశ్, ఆర్తి అగర్వాల్ జంటగా నటించారు. స్రవంతి రవికిశోర్ నిర్మాత. ఈ చిత్రం జనవరి 1న రీరిలీజ్‌గా మరోసారి ప్రేక్షకల ముందుకొస్తోంది. ఈ నేపథ్యంలోనే చిత్రబృందం మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా నిర్మాత స్రవంతి రవికిశోర్ మాట్లాడుతూ ఈ సినిమా విడుదలై పాతికేళ్లయింది. ఇప్పటికీ 'నువ్వు నాకు నచ్చావ్' నిర్మాత అంటే నన్ను చూసే విధానం వేరుగా ఉంటుంది. ఈ సినిమా రూపొందడానికీ, ఇంత బాగా రావడానికి ప్రధాన కారణం వెంకటేశ్. నటుడిగా ఎంతో అద్భుతంగా చేశారు. ఇతర నటులు, దర్శకుడు విజయ్‌భాస్కర్, రచయిత త్రివిక్రమ్, సంగీత దర్శకుడు కోటి... ప్రతి ఒక్కరి అత్యుత్తమ పనితీరు ఇందులో కనిపిస్తుంది. అందుకే ఈ సినిమా ఇప్పటికీ అలా నిలిచిపోయింది. ఇప్పటిలా అప్పుడు ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ ఇతరత్రా దేశాల్లో విడుదల చేయలేదు. ఇప్పుడు మాత్రం అన్ని ప్రాంతాల్లోని ప్రేక్షకులూ చూసి ఆస్వాదించేలా భారీస్థాయిలో విడుదలకు సిద్ధం చేశాం' అన్నారు. త్రివిక్రమ్ మాట్లాడుతూ ఈ సినిమా క్రెడిట్ అంతా కథానాయకుడు వెంకటేశ్‌కే దక్కుతుంది. కథ చెప్పిన వెంటనే ఆయన చేస్తానని ముందుకొచ్చారు. అందరి జీవితాల్లో భాగమైన ఓ సినిమా ఇది. కుటుంబ ప్రేక్షకులంతా కలిసి ఓటీటీ, టీవీ మాధ్యమాల్లో చూశారు. సామూహిక అనుభవం కోసం అందరూ కలిసి మరోసారి థియేటర్లలో చూస్తారు' అన్నారు.



# శివాజీని అందుకే ఆపలేదు: నవదీప్

'దండోరా' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో శివాజీ చేసిన కామెంట్స్ చర్చకు దారి తీసిన విషయం తెలిసిందే. ఆయన మాట్లాడేసమయంలో నవదీప్ కూడా స్టేజ్‌పై ఉన్నారు. తాజాగా ఈ సినిమా ప్రచారంలో భాగంగా చిత్రబృందం విద్యార్థులతో చిట్‌చాట్ నిర్వహించింది. 'శివాజీ మాట్లాడుతున్నప్పుడు మీరెందుకు ఆపలేదు' అనే ప్రశ్నకు నవదీప్ సమాధానమిచ్చారు. ఎవరైనా వేదికపై మాట్లాడేసమయంలో ఆపడం భావ్యం కాదన్నారు. శివాజీ చాలా సీనియర్ అని చెప్పారు.



# డెబ్యూ ప్రాజెక్టుతో రిస్క్ చేస్తున్న హీరోయిన్

బాలీవుడ్ హీరో టైగర్ ష్రాఫ్, మిలాప్ జవేరి కలయికలో ఓ యాక్షన్ పాక్డ్ మూవీ రాబోతున్న సంగతి తెలిసిందే. అయితే వీరిదరి ట్రాక్ రికార్డు గత కొన్ని సినిమాలుగా ఏమంత బాలేదు. బాఘీ4, బడే మియా చోటే మియా, గణపత్ లాంటి సినిమాలు ఫ్లాపైన తర్వాత టైగర్ ష్రాఫ్ మార్కెట్ బాగా డల్ అయింది. అందుకే ఈ సినిమాతో అయినా టైగర్ ష్రాఫ్ కెరీర్ లో కంబ్యాక్ ఇస్తారా లేదా అని అందరూ అనుమానపడుతున్నారు. ఇక మిలాప్ జవేరి కూడా ఈ మధ్య ఫ్లాపుల్లోనే ఉన్నారు. మస్తీ4 సినిమా ఫ్లాప్ గా నిలవగా, ఏక్ దీవానే కీ దీవానియత్ సినిమాతో ఓ మోస్తరు సక్సెస్ దక్కినప్పటికీ, సినిమాను చూసిన చాలా మంది ఆడియన్స్ దాన్ని క్రింజ్ అంటూ ట్రోల్ చేశారు. అలాంటి వారిద్దరి కలయికలో వస్తున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్టు ఇప్పుడు బాలీవుడ్ లో చర్చనీయాంశంగా మారింది. ఇక మిలాప్ జవేరి కూడా ఈ మధ్య ఫ్లాపుల్లోనే ఉన్నారు. మస్తీ4 సినిమా ఫ్లాప్ గా నిలవగా, ఏక్ దీవానే కీ దీవానియత్ సినిమాతో ఓ మోస్తరు సక్సెస్ దక్కినప్పటికీ, సినిమాను చూసిన చాలా మంది ఆడియన్స్ దాన్ని క్రింజ్ అంటూ ట్రోల్ చేశారు. అలాంటి వారిద్దరి కలయికలో వస్తున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్టు ఇప్పుడు బాలీవుడ్ లో చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉంటే ఇలాంటి సినిమాతో ఉప్పెన బ్యూటీ కృతి శెట్టి బాలీవుడ్ లోకి హీరోయిన్ గా ఎంట్రీ ఇవ్వనున్నారు. కృతి ఇప్పటికే తెలుగు, తమిళ భాషల్లో పలు సినిమాలు చేయగా, ఇప్పుడు బాలీవుడ్ లోకి వెళ్తున్నారు. గతంలో కృతి హృతిక్ రోషన్ సూపర్30 లో నటించినప్పటికీ అందులో కృతి లీడ్ రోల్ చేయలేదు. అందుకే కృతి ఈ సినిమాతోనే బాలీవుడ్ డెబ్యూ చేయనుందని అందరూ భావిస్తున్నారు. అయితే ఈ విషయంలో కృతి డెసిషన్ కరెక్ట్ కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. టైగర్ ష్రాఫ్, మిలాప్ జవేరి కలిసి తీస్తున్న సినిమా ద్వారా కృతి డెబ్యూ జరిగితే అది తన ఫ్యూచర్ ఛాన్సులకు హాని కలిగిస్తుందని అనుకుంటున్నారు. పైగా ఇప్పటివరకు టైగర్ ష్రాఫ్ తో కలిసి డెబ్యూ చేసిన హీరోయిన్ల ట్రాక్ రికార్డు చూసుకుంటే, కృతి రిస్క్ తీసుకుంటున్నట్టే అనిపిస్తోంది. ఓ వైపు టైగర్ ష్రాఫ్, మరోవైపు మిలాప్ జవేరి ఇద్దరూ గడ్డు కాలాన్ని ఎదుర్కొంటున్న టైమ్ లో, కృతి ఈ మూవీతో కాకుండా కాస్త వెయిట్ చేసి ఏదైనా మంచి సినిమాతో డెబ్యూ జరిగితే బావుండేదని అందరూ అభిప్రాయపడుతున్నారు. కానీ కొందరు మాత్రం కృతినే టైగర్ ష్రాఫ్ యొక్క ఫ్లాప్స్ స్ట్రీక్ కు ఫుల్ స్టాప్ పెట్టి, అతనికి లక్కీ హీరోయిన్ గా మారుతుందేమో అని ఆశ పడుతున్నారు.



Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463